జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | గురువారం 19 నవంబర్ 2026 | సంపుటి : 01 | సంచిక :296 | పేజీలు : 12 | వెల : 3/-

9440231967 | PRGI No. APTEL/26/A0119,

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, ఏజెన్సీ/కరస్పాండెంట్ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989894528

సంవత్సరం: శ్రీ పరాభవ నామ సంవత్సరం, మాసం: ఆశ్వయుజ మాసం ఋతువు: శరద్ ఋతువు ఆయనం: దక్షిణాయణం విశేషం: అమావాస్య, దీపావళి, నరక చతుర్దశి, లక్ష్మీ పూజాసూర్యోదయం: 6.03 సూర్యాస్తమయం: 5.19 చంద్రోదయం: 5.49 చంద్రాస్తమయం: 4.46 తిథి: బహుళ చతుర్దశి ఉ. 10.26 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: స్వాతి పూర్తిగా ఉంది యోగం: ఆయుష్మాన్ రా. 3.44 వరకు, తదుపరి సౌభాగ్యం కరణం: శకుని ఉ. 10.26 వరకు, తదుపరి చతుష్పాదం రా. 10.43 వరకు, తదుపరి నాగం

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com



ఏపీలో నేటి నుంచి
స్థానిక సంస్థలకు కొత్త పాలకవర్గాలు

- నేడు ఎంపీపీ, వైస్ ఎంపీపీల ఎన్నిక
- రేపు 28 జిల్లాల్లో జడ్పీ చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎంపిక
- ఎన్నికైన రోజు నుంచే ఐదేళ్ల పదవీకాలం ప్రారంభం
- ఉదయం 10 గంటలకు నామినేషన్ల స్వీకరణ
- ఎంపీటీసీలు, జడ్పీటీసీల ద్వారా పరోక్ష ఎన్నికలు
- కో-ఆప్టెడ్ సభ్యుల ఎంపికకు ప్రత్యేక నిబంధనలు
- ఎన్నికల నిర్వహణకు అధికారులకు ఎస్ఈసీ ఆదేశాలు

అమరావతి


ఆంధ్రప్రదేశ్‌లో మండల, జిల్లా పరిషత్‌లకు నూతన పాలకవర్గాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. గురువారం ఎంపీపీలు, వైస్ ఎంపీపీలను ఎంపీటీసీ సభ్యులు ఎన్నుకోనుండగా, శుక్రవారం 28 జిల్లా పరిషత్‌లకు చైర్మన్లు, వైస్ చైర్మన్లను జడ్పీటీసీలు ఎన్నుకోనున్నారు. పరోక్ష పద్ధతిలో జరిగే ఈ ఎన్నికలతో ఎన్నికైన పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం ప్రారంభం కానుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం - మిగతా 3లో

గ్రీన్ ఎనర్జీకి పెద్దపీట

- భవిష్యత్ అవసరాలకు పక్కా ప్రణాళిక!
- రూ.21,838 కోట్లతో గ్రీన్ ఎనర్జీ కారిడార్-3
- ఆరు నెలల్లో 14,852 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ అంచనా
- 103 ప్రాజెక్టులకు ఆమోదం.. రూ.4.20 లక్షల కోట్ల పెట్టుబడులు

అమరావతి

రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను సిద్ధం చేయాలని సూచించారు. ఉండవల్లిలోని క్యాంపు



కార్యాలయంలో ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో విద్యుత్ డిమాండ్, కొత్త ప్రాజెక్టుల పురోగతి, పెట్టుబడుల ఒప్పందాలపై చర్చించారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు విద్యుత్ వినియోగం - మిగతా 3లో



సీజేఐపై అనుచిత వ్యాఖ్యలు..
న్యాయవాదికి సుప్రీంకోర్టు ధిక్కరణ నోటీసులు

- న్యాయవ్యవస్థపై ఆరోపణల నేపథ్యంలో చర్యలు
- వివరణ ఇవ్వాలని ఆదేశం.. 2027 జనవరి 20కు తదుపరి విచారణ



భారత్ వ్యతిరేక ప్రచారానికి
రాహుల్‌గాంధీ నాయకత్వం

- కొలంబియా యూనివర్సిటీలో దేశ ఆర్థిక వ్యవస్థపై వ్యాఖ్యలతో రాజకీయ దుమారం
- విదేశాలకు వెళ్లినప్పుడల్లా తప్పుడు వ్యాఖ్యలు

ఉత్తరాంధ్రకు రెడ్ అలర్ట్

- నరసాపురం--పూరీ మధ్య తీరం దాటే అవకాశం
- గంటకు 110 కి.మీ. వేగంతో ఈదురుగాలులు..
- అప్రమత్తమైన యంత్రాంగం
- తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



విశాఖపట్నం

బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తీవ్ర తుపాను ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల వైపు కదులుతోంది. తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర, యానాం, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. నవంబర్ 20వ తేదీ శుక్రవారం మధ్యాహ్నానికి నరసాపురం--పూరీ మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. భారత వాతావరణ శాఖ తాజా బులెటిన్ ప్రకారం అక్వాన్ తుపాను గత ఆరు గంటల్లో గంటకు 9 కిలోమీటర్ల వేగంతో ఉత్తర వాయవ్య దిశగా కదిలింది. నవంబర్ 18 సాయంత్రం 5.30 గంటల సమయానికి నరసాపురానికి 500 కిలోమీటర్లు, కళింగపట్నానికి 540 కిలోమీటర్లు, చెన్నైకి 560 కిలోమీటర్లు, పూరీకి 690 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. తుపాను మరింత - మిగతా 3లో

ఆయుష్మాన్ భారత్‌లో భారీ మార్పులు!

- 23 నుంచి 112కు పెరగనున్న ప్యాకేజీలు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మరిన్ని చికిత్సలు
- 89 కొత్త వైద్య సేవలకు ప్రతిపాదన
- చిన్నచిన్న వ్యాధులకు స్థానికంగానే వైద్యం
- హిస్టరెక్టమీ నుంచి గ్లకోమా వరకు చికిత్సలు
- ఆస్పత్రుల అభివృద్ధికి అదనపు నిధులు





మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది
లతీఫ్ భట్ హతం

- మసీదులో దాక్కున్నా వదలని భద్రతా బలగాలు..
- లొంగిపోవాలని కోరినా నిరాకరణ
- రూ.15 లక్షల రివార్డు ప్రకటించిన ఉగ్రవాది కథకు తెర..
- ఆపరేషన్‌ను అభినందించిన అమిత్ షా

సెమీకండక్టర్ హబ్‌గా ఏపీ

చిప్ తయారీలో గ్లోబల్ కేంద్రంగా తీర్చిదిద్దుతాం!

మంత్రి నారా లోకేశ్ ప్రకటన

సిలికాన్ ఫ్యాబ్‌లకు 80 శాతం పెట్టుబడి రాయితీ

తిరుపతిలో 5 వేల ఎకరాల్లో ప్రత్యేక పార్క్



అమరావతి

దేశంలోనే సెమీకండక్టర్ తయారీకి ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. చిప్‌ల తయారీ నుంచి ప్యాకేజింగ్ వరకు అన్ని విభాగాల్లో రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయి హబ్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించనున్నట్లు వెల్లడించారు. సిలికాన్ ఫ్యాబ్‌ల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి 80 శాతం వరకు పెట్టుబడి రాయితీ కల్పిస్తాయని తెలిపారు. సెమీకండక్టర్ తయారీ పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించేలా ఏపీ ప్రభుత్వం సెమీకండక్టర్ అండ్ డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ 4.0ను ప్రకటించినట్లు లోకేశ్ వివరించారు. - మిగతా 3లో


మోదీ పాలనలో సామాన్యుడి కంచం చిన్నదైంది!



- ధరల పెరుగుదలపై కేంద్రంపై ఖర్గే ఫైర్
- కనీస అవసరాలకూ కష్టమే
- నిత్యావసరాల ధరలకు రెక్కలు
- దేశ పురోగతికి కొలమానం ప్రసంగాలు కాదు
- ధరల నియంత్రణపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- భారీగా పెరిగిన టోకు ద్రవ్యోల్బణం
- ఇంధనం, ఆహార ధరల ప్రభావం

భారత్-జపాన్ బంధానికి ఇదే సరైన సమయం!

- ప్రపంచ పరిణామాలతో మారుతున్న అంతర్జాతీయ వ్యవస్థ
- కొవిడ్, యుద్ధాలతో సరఫరా వ్యవస్థలకు సవాళ్లు
- తక్కువ ఖర్చు కంటే విశ్వసనీయతకే పెద్దపీట
- జపాన్ పెట్టుబడులకు భారత్ ఆకర్షణీయ గమ్యం
- సెమీకండక్టర్లు, కీలక ఖనిజాల్లో భాగస్వామ్యం



కొండను ఢీకొట్టిన కంటైనర్ లారీ

ఒకరు మృతి.. ఇద్దరుకు గాయాలు



ప్రజాజ్యోతిన్యూస్ పాచిపెంట:- కంటైనర్ లారీ ఘాట్ రోడ్లో కొండను ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా ఇద్దరు గాయాల పాలయ్యారు. పాచిపెంట సబ్ ఇన్స్పెక్టర్ లాలం అర్జున్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తెల్లవారు జామున సుమారు నాలుగు గంటల సమయంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుండి విశాఖపట్నం వైపు వెళ్తున్న ఒక కంటైనర్ లారీ ఘాట్ రోడ్డులో పీ కోనవలస చెక్‌పోస్టుకు సుమారు ఒక కిలోమీటరు దూరంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన మనీష్ కుమార్ (45) మృతి చెందారు.ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.అదేవిధంగా, ప్రమాదానికి గురైన కంటైనర్ లారీని బయటకు తీసేందుకు సహాయక చర్యలు చేపడుతున్న సమయంలో, అక్కడ నిలిపి ఉంచిన ఒడిశా రాష్ట్రం నుండి విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సును, ఒడిశా నుండి బొబ్బిలి వైపు వెళ్తున్న మరో లారీ బ్రేకులు ఫెయిల్ కావడంతో వెనుక నుండి ఢీకొట్టింది. ఈ రెండవ ప్రమాదంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి."ఈ రెండు రోడ్డు ప్రమాదాలకు సంబంధించి కేసులు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు చేపట్టడం జరుగుతోందని ఎస్సై అర్జున్ తెలిపారు.

ప్రజాజ్యోతిన్యూస్ సాలూరు భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 101వ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి గారు



ఈ సందర్భంగా భక్తులతో కలిసి ర్యాలీలో పాల్గొని, భగవాన్ సత్యసాయి బాబా వారు మాన వాళికి అందించిన సేవలు, ప్రేమ, శాంతి, సేవాభావం, మానవతా విలువలను కొనియాడారు "మానవ సేవే మాధవ సేవ" అనే మహోన్నత సందేశంతో సమాజానికి సేవామార్గాన్ని చూపిన భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని మంత్రి పేర్కొన్నారు.

ఆడబిడ్డగా ఆదరించండి శంఖవరం అభివృద్ధికి అవకాశం ఇవ్వండి!

ఇంటింటి ప్రచారంలో ఓటర్ల మద్దతు కోరిన జనసేన సర్పంచ్ అభ్యర్థి మేకల వీరసూర్యకళ కృష్ణ



శంఖవరం, నవంబర్ 18 (ప్రజాజ్యోతి న్యూస్):ఆడబిడ్డగా ఆదరించి తనకు ఒక్క అవకాశం కల్పిస్తే శంఖవరం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అంకితభావంతో పనిచేస్తానని కూటమి జనసేన పార్టీ సర్పంచ్ అభ్యర్థి మేకల వీరసూర్యకళ కృష్ణ అన్నారు. బుధవారం ఆమె గ్రామంలోని పాత బీసీ హాస్టల్ ప్రాంతం, కృష్ణాలయం వీధి, మధ్యవీధి రామాలయం, వినాయకుని గుడి పరిసరాలు, గాంధీ బొమ్మ సెంటర్, అంబేద్కర్ సెంటర్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ తన ఎన్నికల లక్ష్యాలను వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు.ఆమె మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యతనిస్తూ తాగునీరు, పారిశుధ్యం, రహదారులు వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పారదర్శకమైన పాలన అందిస్తానని, ఎలాంటి పక్షపాతం లేకుండా అర్హులందరికీ న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ పదవిని అధికారంగా కాకుండా ప్రజలకు సేవ చేసే బాధ్యతగా భావిస్తానని పేర్కొంటూ, గ్రామ ప్రజలు తనను ఆశీర్వదించి సర్పంచిగా గెలిపించాలని మేకల వీరసూర్యకళ కృష్ణ అభ్యర్థించారు. ఈ ప్రచారంలో జనసేన కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అనంతపురం జిల్లా కలెక్టర్,జిల్లా కార్యాలయంలో వైస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై.నైరుతి రెడ్డి . ఫిర్యాదు.



ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు ఈరోజు గుంతకల్లు నియోజకవర్గంలో పలుచోట్లా గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలలో టీడీపీ వాళ్లు.వైస్సార్సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా బెదిరింపులు,దాడులు జరగకుండా చూడాలని సూచించారు. గ్రామాలలో నామినేషన్ వేస్తున్న వార్డ్,సర్పంచ్ అభ్యర్థులకు పోలీస్ లు,అధికారులు. రక్షణ కలిపించి నామినేషన్లు వేయించాలని కోరుచున్నారు వైస్సార్సీపీ గుంతకల్లు నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు,ఇంచార్జ్ వై.వెంకటరామి రెడ్డి ఆదేశాలు మేరకు నేడు అనంతపురం జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ కార్యాలయంలో వైస్సార్సీపీ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు . వై.నైరుతి రెడ్డి ,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చుక్కలూరు దిలీప్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పిర్యాదు చేయటం జరిగింది.

నంద్యాలలో డిసెంబర్ 17, 18 తేదీల్లో దీని ఇజ్తెమా.. ఏర్పాట్లను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యేశిల్పా రవి రెడ్డి ఎమ్మెల్సీ ఇషాక్ భాషా..



నంద్యాల:నవంబర్=18 ప్రజాజ్యోతి నంద్యాల పట్టణంలోని శాంతిరామ్ ఆసుపత్రి సమీపంలో ఉన్న సున్నీ మసీదు ఆవరణలో డిసెంబర్ 17, 18 తేదీల్లో నిర్వహించనున్న దీని ఇజ్తెమా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ భాషా పరిశీలించారు.ఈ సందర్భంగా ఇజ్తెమాకు విచ్చేసే సోదరులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లను సమర్థవంతంగా పూర్తి చేయాలని నిర్వాహకులతో చర్చించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు డాల్ మిల్ అమీర్, గన్ని కరీం, సలాముల్లా, జాకీర్ హుస్సేన్, యూనస్, సోహెల్ రానా, మునయ్య, మాజీ కౌన్సిలర్లు ఆరిఫ్ నాయక్, కలాం, తబ్రేజ్, మజీద్, సాదిక్ బాషా, సమ్మద్ మరియు , ముస్లిం సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నర్శిపూడిలో ఈ నెల 21న శ్రీ లక్ష్మీ నారాయణస్వామి వారి కోటి దీపాల మహోత్సవం.



ఆలమూరు నవంబర్ 18(ప్రజాజ్యోతి):ఆలమూరు మండలం నర్శిపూడి గ్రామంలో వేం చేసియున్న శ్రీ లక్ష్మీ నారాయణస్వామి వారి 36వ క్షీరాబ్ధి ద్వాదశి కోటి దీపాల మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 21వ తేదీ (శనివారం) రాత్రి 6 గంటల నుండి ఈ పవిత్రోత్సవం ప్రారంభమవుతుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి భక్తులందరూ అధిక సంఖ్యలో తరలివచ్చి, దీపారాధనలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి, భగవంతుని కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు భక్తులను కోరుతున్నారు.

ప్రాథమిక సహకార సొసైటీలో రైతులు ఈకైవైసీ చేసుకోవాలి





గాలివీడు:నవంబర్ 18. నూలివీడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ (1092) నూలివీడు ప్యాక్స్ లిమిటెడ్ సభ్యులందరికీ సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఉన్నతాధికారుల మెమో ప్రకారం, ఈ కేవైసీ పూర్తి చేయని సభ్యులను ఓటరు జాబితాలో అనర్హులుగా పరిగణించే అవకాశం ఉన్నది.కావున, నూలివీడు ప్యాక్స్ సభ్యులందరూ ఎటువంటి ఆలస్యం చేయకుండా తమ ఈ కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవలసిందిగా కోరడమైనది. ఈకేవైసీ పూర్తి చేయని కారణంగా ఓటు హక్కుకు సంబంధించిన ఇబ్బందులు ఎదురైతే సభ్యులే బాధ్యత వహించవలసి ఉంటుంది. కావున సభ్యులందరూ ఈ విషయాన్ని గమనించి వెంటనే ఈ కేవైసీ పూర్తి చేసుకోగలరు. మరియు సంఘములో అప్పు తీసుకున్న వాయిదా మీరిన అప్పు ఉన్న ఎడల సభ్యులు అప్పు చెల్లించి మీయొక్క ఓటు హక్కు పొందుటకు అర్హులు అన్నారు.

జలజీవన్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



గాలివీడు, నవంబర్ 18: అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ గారు బుధవారం గాలివీడు మండలంలోని వెలిగల్లు ప్రాజెక్టు వద్ద నూతనంగా నిర్మితమవుతున్న జలజీవన్ మిషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు వద్ద జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. పనుల నాణ్యత, నిర్మాణ ప్రమాణాలను పరిశీలించి సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. జలజీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా చేపట్టిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.

వెలుగోడులో జనసేన అభ్యర్థుల నామినేషన్లకు అడ్డంకులు కలెక్టర్, ఎస్పీ వెంటనే స్పందించాలి

-- జనసేన కార్యకర్తల విజ్ఞప్తి

నంద్యాల(వెలుగోడు):నవంబర్=18

ప్రజాజ్యోతి వెలుగోడు గ్రామంలో జనసేన పార్టీ తరపున సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, నామినేషన్లు స్వీకరించడం లేదని సమాచారం వెలువడుతోంది. ఈ పరిణామంపై జనసేన పార్టీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ , ఎస్పీ వెంటనే స్పందించి, వెలుగోడులో సర్పంచ్ మరియు వార్డు మెంబర్ అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని జనసేన కార్యకర్తలు కోరుతున్నారు. ప్రతి అభ్యర్థికి రాజ్యాంగబద్ధంగా కల్పించిన నామినేషన్ హక్కును కాపాడుతూ, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

18వ వార్డులో బోరు మరమ్మతు పనులు ప్రారంభం

ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు: కౌన్సిలర్ భార్గవతేజ్



ప్రజా జ్యోతి -- నందికొట్కూరు: నందికొట్కూరు పట్టణంలోని 18వ వార్డు కో-ఆపరేటివ్ బ్యాంకు సందులో ఉన్న బోరు మరమ్మతు పనులను వార్డు కౌన్సిలర్ బలస భార్గవతేజ్ ప్రత్యేక చొరవతో ప్రారంభించారు. బోరు మరమ్మతులకు గురికావడంతో స్థానిక ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పనులు చేపట్టారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ భార్గవతేజ్ మాట్లాడుతూ వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. తాగునీరు, పారిశుధ్యం తదితర సమస్యలపై ఎప్పటికప్పుడు దృష్టి సారిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. బోరు మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. మరమ్మతు పనులు పూర్తయితే స్థానిక ప్రజలకు తాగునీటి సమస్య నుంచి ఉపశమనం లభించనుంది.ఈ కార్యక్రమంలో మరమ్మతు పనులకు సంబంధించిన సిబ్బంది పాల్గొన్నారు.

కోవెలకుంట్ల మండలంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం.



బనగానపల్లె:కోవెలకుంట్ల:నవంబర్ =18 ప్రజాజ్యోతి కోవెలకుంట్ల మండల వ్యప్తంగా 17 సర్పంచ్ స్థానాలకు బుదవారం నుండి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన ఈ నేపధ్యంలో ప్రజలతో స్థానిక నేతలు మమేకమయ్యేందుకు సిద్దమవుతున్నారు ఇప్పటికే మండల కేంద్రమైన కోవెలకుంట్ల తో పాటు పలు గ్రామాల్లో టిడిపీ వైసీపీ నేతలు పార్టీ క్యాడర్ సామాజిక వర్గాల వారిగా ముఖ్య కార్యకర్తలు ప్రజలతో మంతనాలు జరుపడం మొదులెట్టారు ఈకార్యక్రమంలోఓటర్లను అకట్టు కొనేందుకు హమీలు వర్షం కురిపిం స్తుంనంట్లు తెలుంస్తుంది

గ్రీన్ ఎనర్జీకి పెద్దపీట..

-మొదటిపేజీ తరువాయి


18.23 శాతం పెరిగినట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావం సహా వాతావరణ పరిస్థితులు విద్యుత్ డిమాండ్‌పై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. రానున్న ఆరు నెలల్లో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 14,852 మెగావాట్లకు చేరే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సీఎం ఆదేశించారు.

రూ.21,838 కోట్లతో గ్రీన్ ఎనర్జీ కారిడార్

పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను బలోపేతం చేసేందుకు రూ.21,838 కోట్ల వ్యయంతో గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 ప్రణాళికలను సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. ఈ కారిడార్ ద్వారా 47 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను సరఫరా చేసే సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి పెరిగే కొద్దీ వాటిని గ్రిడ్‌కు అనుసంధానించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

36,050 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు

రాష్ట్రవ్యాప్తంగా 36,050 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో హెచ్చుతగ్గులు



ఉన్నప్పుడు విద్యుత్ సరఫరాను సమతుల్యం చేసేందుకు ఈ ప్రాజెక్టులు ఉపయోగపడతాయని వివరించారు. ప్రాజెక్టుల అనుమతులు, నిర్మాణ ప్రక్రియలను వేగవంతం చేసి నిర్దేశిత కాలపరిమితిలో పనులు పూర్తయ్యేలా చూడాలని సీఎం ఆదేశించారు.

9 లక్షల సోలార్ కనెక్షన్ల లక్ష్యం

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేయాలని సమీక్షలో నిర్ణయించారు. ఈ నెలాఖరు నాటికి తొమ్మిది లక్షల సోలార్ కనెక్షన్లు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు అధికారులు తెలిపారు. గృహాలపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటును ప్రోత్సహించి, ప్రజలకు విద్యుత్ ఖర్చు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

ఇంధన రంగంలో రూ.4.20 లక్షల కోట్ల పెట్టుబడులు

రాష్ట్రంలో ఇంధన రంగానికి పెట్టుబడులు పెరుగుతున్నాయని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు 103 విద్యుత్ ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, వీటి ద్వారా రూ.4.20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని వివరించారు. విశాఖపట్నంలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో విద్యుత్ రంగానికి సంబంధించి మరో రూ.2.56 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు కుదిరినట్లు తెలిపారు.

ఒప్పందాలు కార్యరూపం దాల్చాలి

పెట్టుబడుల ఒప్పందాలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా వాస్తవ ప్రాజెక్టులుగా మారాలని చంద్రబాబు స్పష్టం చేశారు. అనుమతులు, భూసేకరణ, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో సమన్వయంతో ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేసి, రాష్ట్ర విద్యుత్ అవసరాలకు దీర్ఘకాలిక పరిష్కారాలు చూపాలని సూచించారు. సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తూ, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

సెమీకండక్టర్ హబ్‌గా ఏపీ..

-మొదటిపేజీ తరువాయి

ఈ విధానం కింద సిలికాన్ ఫ్యాబ్‌ల ఏర్పాటుకు కేంద్రం, రాష్ట్రం కలిపి 80 శాతం వరకు పెట్టుబడి రాయితీ అందిస్తాయని పేర్కొన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇది అత్యధిక ప్రోత్సాహకమని ఆయన తెలిపారు. డిస్‌ప్లే, కాంపౌండ్ సెమీకండక్టర్ ఫ్యాబ్‌లకు 70 శాతం వరకు ప్రోత్సాహకాలు కల్పిస్తామని వెల్లడించారు.

తిరుపతిలో 5 వేల ఎకరాల్లో పార్క్

సెమీకండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఒకే ప్రాంతంలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా తిరుపతిలో 5 వేల ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యేక సెమీకండక్టర్ పార్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. పరిశ్రమలకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు, రవాణా సదుపాయాలతో పాటు వేగవంతమైన అనుమతుల కోసం సింగిల్ విండో వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

ఇండియా సెమీకండక్టర్ మిషన్-2కు అనుగుణంగా



కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న రెండో దశ ఇండియా సెమీకండక్టర్ మిషన్‌కు అనుగుణంగా రాష్ట్ర సెమీకండక్టర్ విధానాన్ని సవరించినట్లు లోకేశ్ చెప్పారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంతో పాటు దేశీయంగా చిప్ తయారీ సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ విధానం దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వివరించారు.

యువతకు ప్రత్యేక శిక్షణ.. నెలకు రూ.10 వేలు

సెమీకండక్టర్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యమున్న మానవ వనరులను తయారు చేయడంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టింది. యువతకు ఈ రంగంలో ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు మంత్రి తెలిపారు. శిక్షణ పొందే ఒక్కో అభ్యర్థికి నెలకు రూ.10 వేల చొప్పున ప్రోత్సాహకం అందిస్తామని ప్రకటించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

దేశీయ చిప్ తయారీకి ఏపీ వేదిక

భారత్ తన అవసరాలకు సంబంధించిన చిప్‌లను దేశంలోనే తయారు చేసుకునే స్థాయికి ఎదగాల్సిన అవసరం ఉందని లోకేశ్ పేర్కొన్నారు. ఆ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. చిప్ తయారీ, ప్యాకేజింగ్, పరిశోధన, సాంకేతిక అభివృద్ధి వంటి విభాగాలను ఒకే పారిశ్రామిక వ్యవస్థగా అనుసంధానించి రాష్ట్రాన్ని అంతర్జాతీయ సెమీకండక్టర్ రంగంలో కీలక కేంద్రంగా నిలబెట్టేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.

ఇన్సూరెన్స్ లేని వాహనాలకు టోల్ వద్దే చెక్!

అమరావతి : వాహనాలకు తప్పనిసరిగా ఉండాల్సిన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించేందుకు చర్యలు చేపడుతోంది. బీమా గడువు ముగిసిన లేదా ఇన్సూరెన్స్ లేని వాహనాలను జాతీయ రహదారులపై టోల్ ప్లాజాల వద్దే గుర్తించే విధానాన్ని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ఈ విధానంలో వాహనం టోల్ ప్లాజా దాటగానే దాని బీమా వివరాలను వాహన్ డేటాబేస్‌తో పరిశీలించి, పాలసీ గడువు ముగిసినట్లయితే యజమానికి ఎస్ఎంఎస్ పంపిస్తారు. ఈ నేపథ్యంలో వాహనదారులు తమ ఇన్సూరెన్స్ గడువును ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని ఏపీ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచించారు.

టోల్ దాటగానే బీమా వివరాల తనిఖీ

ప్రస్తుతం వాహనానికి ఇన్సూరెన్స్ ఉందా లేదా అనే విషయం సాధారణంగా తనిఖీల సమయంలోనే బయటపడుతోంది. కొత్త విధానం అమల్లోకి వస్తే టోల్ ప్లాజా దాటిన వెంటనే వాహనం రిజిస్ట్రేషన్ వివరాలను వాహన్ డేటాబేస్‌లో పరిశీలిస్తారు. ఆ వాహనానికి చెల్లుబాటయ్యే థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ఉందా లేదా అనేది ఆటోమేటిక్‌గా తనిఖీ చేస్తారు. పాలసీ గడువు ముగిసినట్లు గుర్తిస్తే వాహన యజమాని రిజిస్టర్ చేసుకున్న మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్ పంపిస్తారు.

దిల్లీలో ప్రయోగాత్మకంగా అమలు

దిల్లీలోని ముండ్కా టోల్ ప్లాజా వద్ద ఎన్‌హెచ్‌ఏఐ ఈ



విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించింది. వాహనాల వివరాలను నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) నిర్వహించే వాహన్ డేటాబేస్‌తో అనుసంధానించి బీమా స్థితిని పరిశీలిస్తున్నారు. ఇన్సూరెన్స్ గడువు ముగిసిన వాహనాలకు రిజిస్ట్రేషన్ నంబర్, టోల్ దాటిన సమయం, బీమా గడువు ముగిసిన తేదీ వంటి వివరాలతో సందేశం పంపిస్తారు. ప్రస్తుతం ఇది ప్రయోగాత్మక దశలోనే ఉంది. దేశవ్యాప్తంగా ఎప్పటి నుంచి అమలు చేస్తారనే తేదీని ఎన్‌హెచ్‌ఏఐ ఇంకా ప్రకటించలేదు.

థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ తప్పనిసరి

మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 146 ప్రకారం రోడ్లపై తిరిగే వాహనాలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ తప్పనిసరి. ప్రమాదాల్లో ఇతరులకు గాయాలు, ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరిగితే బాధితులకు పరిహారం అందించడంలో ఈ బీమా కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల ప్రతి వాహన యజమాని తన పాలసీ గడువును పరిశీలించుకోవాలని, గడువు ముగియకముందే రెన్యువల్ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

జరిమానాలు భారీగా పెంపు

ఇన్సూరెన్స్ లేకుండా వాహనం నడిపితే మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 196 ప్రకారం జరిమానా విధిస్తారు. 2026 ఆగస్టు 15 నుంచి అమల్లోకి వచ్చిన సవరణ ప్రకారం మొదటిసారి ఉల్లంఘనకు వాహనం బేస్ ప్రీమియానికి మూడు రెట్లు లేదా రూ.5,000ల్లో ఏది ఎక్కువైతే ఆ మొత్తాన్ని జరిమానాగా చెల్లించాలి. రెండోసారి లేదా ఆ తర్వాత ఉల్లం ఘనకు బేస్ ప్రీమియానికి ఐదు రెట్లు లేదా రూ.10,000ల్లో ఏది ఎక్కువైతే ఆ మొత్తం జరిమానాగా విధిస్తారు.

గడువు ముగియకముందే రెన్యువల్ చేసుకోండి

వాహనదారులు ఇన్సూరెన్స్ గడువు ముగిసిన తర్వాత నిర్లక్ష్యం చేయకుండా ముందుగానే రెన్యువల్ చేసుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచించారు. బీమా లేకుండా వాహనాలు నడిపి జరిమానాలు, చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవద్దని కోరారు. సురక్షిత ప్రయాణంతో పాటు రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక భరోసా కల్పించడంలో థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ కీలకమని పేర్కొన్నారు. రవాణా శాఖ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వాహనదారులకు విజ్ఞప్తి చేశారు.

తిరుమల శ్రీవారి భక్తులకు అలర్ట్

వైకుంఠ ద్వార దర్శనాలు ఎప్పటి నుంచి అంటే..!

తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 20 నుంచి 29వ తేదీ వరకు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాలను కల్పించనున్నారు. పరమ పవిత్రమైన వైకుంఠ ద్వార దర్శనాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ 10 రోజుల వ్యవధిలో మొత్తం 8.34 లక్షల మంది భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేలా ప్రణాళికలు రూపొందించినట్లు టీటీడీ సాధికారిక మండలి ఛైర్మన్ ముద్దాడ రవిచంద్ర వెల్లడించారు. తిరుమల అన్నమయ్య భవనంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన సాధికారిక మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ముద్దాడ రవిచంద్ర మాట్లాడుతూ, వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్య భక్తులకే అత్యధికంగా 92 శాతం ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాలకు సంబంధించిన ఎస్ఎస్‌డీ టోకెన్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపారు. తొలి రెండు రోజులు ఎలాంటి సర్వదర్శనం ఉండదని, ఆ తర్వాతి 8 రోజుల పాటు భక్తులకు సర్వదర్శనం అమలు చేస్తామని వివరించారు. భక్తుల సౌకర్యార్థం అలిపిరి--ఎస్వీ జూ పార్క్ రోడ్డు సమీపంలోని టీటీడీ స్థలంలో శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.2,750 కోట్లతో అత్యాధునిక యాత్రికుల టౌన్‌షిప్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టు డీపీఆర్, డిజైన్ల తయారీ, పర్యవేక్షణ కోసం ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థను ఎంపిక చేయాలని బోర్డు నిర్ణయించింది. అలాగే శ్రీనివాస మంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి శ్రీవారిమెట్టు వరకు రహదారి అభివృద్ధి, ఇంటర్‌లాకింగ్ సిమెంట్ బ్లాక్‌ల నిర్మాణం కోసం రూ.9.50 కోట్లు మంజూరు చేశారు. అలిపిరి నడకమార్గంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి మోకాళ్లమిట్ట వరకు రోడ్డుపై నడిచివచ్చే భక్తుల కోసం ఐఐటీ నిపుణుల సహకారంతో కేబుల్ బ్రిడ్జి నిర్మాణ సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉద్యోగులకు అందించే ప్రోత్సాహక బహుమానాన్ని ఖరారు చేశారు. శాశ్వత ఉద్యోగులకు రూ.16,940, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రూ.8,289 చొప్పున చెల్లించనున్నారు. 2007 సీనియారిటీ జాబితా ప్రకారం ఫేజ్-3 పరిధిలోని రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి వారసులకు పల్లం గ్రామంలో ఇంటి ప్లాట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపారు. మిగిలిన అర్హుల పరిశీలనకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నారు. పాదిరేడు లేఅవుట్ అభివృద్ధికి సంబంధించి గతంలో కేటాయించిన రూ.230 కోట్ల ధ్రువీకరణకు మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు పరిహారంతో పాటు, భవిష్యత్తులో అర్హులైన ఉద్యోగుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల ఆర్థిక ప్రయోజనం దక్కేలా నూతన సంక్షేమ విధానాన్ని తీసుకురానున్నారు. పేద రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు, పాత బకాయిల చెల్లింపులకు గాను స్విమ్స్ ఆసుపత్రికి అదనంగా రూ.41.23 కోట్ల ప్రత్యేక గ్రాంటును కేటాయించారు. ఎస్వీ ఆయుర్వేద కళాశాలలో బీఏఎంఎస్ సీట్లను 40 నుంచి 60కి పెంచారు.

ఉత్తరాంధ్రకు రెడ్ అలర్ట్



-మొదటిపేజీ తరువాయి

ముందుకు కదులుతూ ఉత్తరాంధ్ర, యానాం, దక్షిణ ఒడిశా తీరాల మధ్య తీరం దాటవచ్చని అంచనా.

ఉత్తరాంధ్రలో వర్ష సూచన

తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. శ్రీకాకుళం జిల్లాలో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయి. తీర ప్రాంతాల్లో బలమైన గాలులు వీచే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

సహాయక బృందాలు సిద్ధం

తుపాను కదలికను ఆర్టీజీఎస్, విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జిల్లా యంత్రాంగాలకు ఎప్పటికప్పుడు సూచనలు అందిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు 13 ఎన్డీఆర్ఎఫ్, 11 ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు అగ్నిమాపక సిబ్బందిని సిద్ధంగా ఉంచినట్లు అధికారులు వెల్లడించారు. అవసరమైన చోట ముందస్తు సహాయక చర్యలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తుపాను ప్రభావం దృష్ట్యా అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని, ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు తీరానికి చేరుకోవాలని సూచిస్తున్నారు. రైతులు పంటలను కాపాడుకునేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, కోతకు సిద్ధంగా ఉన్న పంటలను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని సూచిస్తున్నారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని విపత్తుల నిర్వహణ సంస్థ కోరుతోంది.

తుపాను గమనంపై నిరంతర నిఘా

అక్వాన్ తుపాను తీరం దాటే ప్రాంతం, తీవ్రత, వర్షపాతం అంచనాలపై వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు బులెటిన్లు విడుదల చేస్తోంది. పరిస్థితులకు అనుగుణంగా జిల్లాల వారీగా హెచ్చరికలు, సహాయక చర్యల్లో మార్పులు చేసే అవకాశం ఉంది. ప్రజలు వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని యంత్రాంగం సూచిస్తోంది.

ఏపీలో నేటి నుంచి స్థానిక సంస్థలకు కొత్త పాలకవర్గాలు



-మొదటిపేజీ తరువాయి

కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నోటిఫికేషన్ జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 659 మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించారు. 9 వేలకుపైగా ఎంపీటీసీ స్థానాలు, 659 జడ్పీటీసీ స్థానాలకు ఈ నెల 5న పోలింగ్ జరిగింది. తుపాను ప్రభావం, రీపోలింగ్ కారణంగా కొన్ని ప్రాంతాల్లో నవంబర్ 6న కూడా ఓటింగ్ నిర్వహించారు. నవంబర్ 7న ఓట్ల లెక్కింపు పూర్తి చేసి ఫలితాలు ప్రకటించారు. తాజాగా ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు తేదీలను ఖరారు చేస్తూ ఎస్ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఉదయం 10 గంటలకు ఎంపీపీ ఎన్నికల ప్రక్రియ

గురువారం ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల కోసం ఉదయం 10 గంటలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. ఉదయం 11 గంటలకు నామినేషన్ల పరిశీలన చేపడతారు. ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లు దాఖలైతే సంబంధిత పదవికి ఎన్నిక నిర్వహిస్తారు. పోటీ లేకపోతే మధ్యాహ్నం 12 గంటలకు ఏకగ్రీవ ఎన్నికను ప్రకటించి, అనంతరం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తారు.

రేపు జడ్పీ చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎంపిక

శుక్రవారం రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్‌లకు చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎన్నికలు నిర్వహించనున్నారు. సంబంధిత జడ్పీటీసీ సభ్యులు పరోక్ష పద్ధతిలో తమ ప్రతినిధులను ఎన్నుకుంటారు. ఎంపీపీలు, జడ్పీ చైర్మన్లతో పాటు వైస్ పదవులకు ఎన్నికైన వారి పదవీకాలం కూడా ఎన్నికైన రోజు నుంచే లెక్కించనున్నారు.

కో-ఆప్టెడ్ సభ్యుల ఎంపికకు ప్రత్యేక నిబంధనలు

ప్రతి మండల పరిషత్‌లో ఒక కో-ఆప్టెడ్ సభ్యుడిని, ప్రతి జిల్లా పరిషత్‌లో ఇద్దరు కో-ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం మతపరమైన మైనారిటీ వర్గాలకు లేదా భాషాపరమైన మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన వ్యక్తులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, పార్సీ మతాలకు చెందినవారు మతపరమైన మైనారిటీలుగా, తెలుగు కాకుండా ఇతర మాతృభాష కలిగినవారు భాషాపరమైన మైనారిటీలుగా పరిగణించబడతారు.

పార్టీ విప్ తప్పనిసరి

ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు జారీ చేసే విప్ నిబంధనలు వర్తిస్తాయి. అయితే కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికకు పార్టీ విప్ వర్తించదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. సంబంధిత పరిషత్‌లలో ఎక్స్-అఫీషియో సభ్యులుగా ఉన్న ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు ప్రత్యేక సమావేశాలకు హాజరయ్యే అవకాశం ఉంటుంది. అయితే ఈ పరోక్ష ఎన్నికల్లో వారికి ఓటు హక్కు ఉండదు.

ఎన్నికల నిర్వహణకు అధికారుల ఏర్పాట్లు

ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్, కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారులకు ఎస్ఈసీ ఆదేశాలు జారీ చేసింది. మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి, వారి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని జిల్లా కలెక్టర్లకు సూచించింది. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీలకు ఆదేశాలు ఇచ్చింది.

పోరుమామిళ్ల సమగ్రాభివృద్ధికి షేక్ సునీహాను ఆశీర్వదించండి.నల్లేరు విశ్వనాథ రెడ్డి పిలుపు



పోరుమామిళ్ల నవంబర్ 18 (ప్రజా జ్యోతి ప్రతినిధి) పోరుమామిళ్ల మేజర్ గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ సర్పంచ్ అభ్యర్థి శ్రీమతి షేక్ సునీహ గారికి మద్దతుగా పార్టీ అదనపు సమన్వయకర్త శ్రీ నల్లేరు విశ్వనాథ రెడ్డి గారు విస్తృతంగా పర్యటించారు. ఈరోజు పట్టణంలోని గాండ్ల వీధి, మంగలి వీధి, చాకలి వీధి మరియు కొలిమి బజార్ ప్రాంతాల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి స్థానిక ప్రజలను, పెద్దలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నల్లేరు విశ్వనాథ రెడ్డి గారు మాట్లాడుతూ, పోరుమామిళ్ల గ్రామ పంచాయతీ మరింత అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలన్నా శ్రీమతి షేక్ సునీహ గారిని సర్పంచ్‌గా ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవ చేసే నాయకత్వాన్ని బలపరచాలని, రాబోయే ఎన్నికల్లో షేక్ సునీహ గారికి అత్యధిక మెజార్టీ అందించి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

ప్రత్యర్థి పై సమ్మోహనాస్త్రం వదిలిన వైసిపి

మంచికి మానవత్వానికి స్నేహానికి మారుపేరైన పాతకుంటావనజారెడ్డిని
కంపమల్ల సర్పంచ్ బరిలో నామినేషన్ వేయించిన వైసిపి.



కోవెలకుంట్ల :నవంబర్=18 కోవెలకుంట్ల మండల పరిధిలోని కంప మల్ల గ్రామంలో మంచికి మారుపేరుగా మానవసేవే మాధవసేవగా ప్రజలకు విశేష సేవలు అందిస్తూ గ్రామంలో ప్రజాదరణ పొందిన నాయకురాలు ఎవరైనా ఉన్నారు అని అంటే అది ఒక పాతకుంట వనజారెడ్డిగారు మాత్రమే అని కంపమల్ల పంచాయతీ గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు.మండల కేంద్రంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకునిగా ఆపదలో ఆదుకునే ఆపద్బాంధవునిగా మానవతా దృక్పథంతో సాటి మనిషికి సేవలు అందించే గుణం కలిగిన సోముల వెంకటేశ్వర రెడ్డిసతీమణి గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల బరిలో నిలచి ఉన్నారు అని గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తెలియజేశారు. పాతకుంట వనజారెడ్డిగారు సర్పంచ్ బరిలో నిలచడం పంచాయతీ గ్రామ ప్రజల అదృష్టమని హర్షం వ్యక్తం చేస్తున్నారు. వనజారెడ్డి గారి భర్తా వైసీపి నాయకులు బావ సర్పంచ్ గా మామ వెంకటరామిరెడ్డి వైసీపి సీనియర్ నాయకుడుగా మాజీ ఎంపీటీసీ సోములసుదాకర్ రెడ్డి కుటుంబానికి 15 సంవత్సరాలకు పైగా రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుండి పాతకుంటవనజారెడ్డిని రంగంలోకి దింపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార జాతర కొనసాగుతుందని అన్నారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా, ప్రజా సేవే ధ్యేయంగా బరిలోకి దిగుతున్న వనజారెడ్డి ని అఖండ మెజారిటీతో గెలిపించి అభివృద్ధి సంక్షేమానికి నాంది పలకాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు సూచించారు.

నందవరం సర్పంచ్ గా ఈడిగ తేజేశ్వరి నామినేషన్



బనగానపల్లె ,నవంబర్ 18 ప్రజాజ్యోతి బనగానపల్లె మండలం నందవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ గా బీసీ సామాజిక వర్గానికి చెందిన ఈడిగ తేజేశ్వరి నామినేషన్ వేశారు బుధవారం మండలంలోని నందవరం గ్రామ సచివాలయం లో ఈడిగ తేజేశ్వరి నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుందరయ్య కు అందజేశారు.ఈడిగ సామాజిక వర్గానికి చెందిన చంద్రశేఖర్ గౌడ్ కుటుంబం 40 సంవత్సరాల నుండి కాటసాని కుటుంబానికి వీర విధేయులుగా పనిచేస్తున్నారు .నందవరం గ్రామ సర్పంచ్ గా బీసీ గౌడ్ సామజిక వర్గం నుండి యువనాయకురాలు విద్యాధికురాలు ఈడిగ తెజేశ్వరి నామినేషన్ వేశారు . తనను గ్రామ పంచాయితీ ఎన్నికల్లో గెలిపిస్తే గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో పోటీ చేస్తున్నానని తనను సర్పంచ్ గా గెలిపిస్తే కాటసాని కుటుంబ సహకారంతో గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని తెలిపారు. తెజేశ్వరి భర్త ఈడిగ చంద్రశేఖర్ గౌడ్ ఇటీవల జరిగిన నందవరం ఎంపీటీసీ 1, ఏకగ్రీవంగా ఎన్నకయ్యారు.

సైబర్ నేరాలపై అప్రమత్తతే శ్రీరామరక్ష

లోన్ యాప్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి....
ఆన్‌లైన్ మోసాల పట్ల విద్యార్థులు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలి.....
స్వీయ నియంత్రణ పాటించండి.... సైబర్ నేరాలను నివారించండి....
సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ ప్రభాకర్ రెడ్డి





నంద్యాల:నవంబర్=18(ప్రజాజ్యోతి) నంద్యాల జిల్లా ప్రజలు, విద్యార్థిని విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్, ఐపిఎస్ గారి ఆదేశాల మేరకులి సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల నందు విద్యార్థినీ విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత ఇటీవల కాలంలో ఎక్కువగా ఎదుర్కొంటున్న వివిధ రకాల ఆన్‌లైన్ మోసాలపై సైబర్ క్రైమ్ సిబ్బంది విస్తృతంగా అవగాహన కల్పించారు.

ఆన్‌లైన్ లోన్ యాప్ మోసాలపై అవగాహన

అత్యవసర సమయంలో సులభంగా రుణాలు ఇస్తామంటూ గుర్తుతెలియని లోన్ యాప్‌ల ద్వారా వ్యక్తిగత వివరాలు, ఫోన్ కాంటాక్టులు, ఫోటోలు సేకరించి అనంతరం వేధింపులకు పాల్పడే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ ఇవ్వవద్దని తెలిపారు.

ఉద్యోగాల పేరుతో మోసాలు

ఇంట్లో నుంచే భారీ జీతంతో ఉద్యోగం, విదేశీ ఉద్యోగం, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామంటూ ముందుగా డబ్బులు చెల్లించాలని కోరే మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఉద్యోగ ప్రకటన నిజమైనదో కాదో ధృవీకరించకుండా ఎలాంటి రుసుములు చెల్లించవద్దని తెలిపారు.

పెట్టుబడుల పేరుతో భారీ మోసాలు

ఆన్‌లైన్ ట్రేడింగ్, షేర్ మార్కెట్, క్రిప్టో, పెట్టుబడుల ద్వారా తక్కువ సమయంలో భారీ లాభాలు వస్తాయని నమ్మించి డబ్బులు పెట్టించుకుని మోసం చేసే విధానాలను వివరించారు. ముఖ్యంగా సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులు, టెలిగ్రామ్ ఛానళ్ల ద్వారా వచ్చే అనుమానాస్పద పెట్టుబడి ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మార్ఫింగ్ ఫోటోలతో బెదిరింపులు

మహిళలు, యువతుల ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేస్తామని బెదిరించడం, డబ్బులు డిమాండ్ చేయడం వంటి సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఇలాంటి ఘటనలు ఎదురైతే భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

డిజిటల్ అరెస్ట్' పేరుతో మోసాలు

పోలీసులు, సీబీఐ, కస్టమ్స్, కోర్టు అధికారులు అంటూ వీడియో కాల్స్ చేసి మీపై కేసు నమోదైందని, అరెస్ట్ చేస్తామని బెదిరించి డబ్బులు బదిలీ చేయించుకునే 'డిజిటల్ అరెస్ట్' మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నిజమైన పోలీసు అధికారులు వీడియో కాల్ ద్వారా అరెస్ట్ చేయడం లేదా బెదిరించి డబ్బులు బదిలీ చేయించడం జరగదని స్పష్టం చేశారు.

ఇంపర్సనేషన్ మోసాలపై హెచ్చరిక

కుటుంబ సభ్యులు, స్నేహితులు, పోలీసు అధికారులు, బ్యాంకు సిబ్బంది లేదా ఇతర ప్రముఖుల పేర్లు, ఫోటోలు ఉపయోగించి నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించి డబ్బులు అడిగే మోసాల గురించి వివరించారు. ఎవరైనా అత్యవసరంగా డబ్బులు అడిగితే ముందుగా ఫోన్ చేసి వారి గుర్తింపును నిర్ధారించుకోవాలని సూచించారు.

విద్యార్థులకు ముఖ్యమైన సైబర్ భద్రత సూచనలు

తెలియని లింకులపై క్లిక్ చేయవద్దు.
పాస్‌వర్డ్‌లు ఎవరికీ చెప్పవద్దు.
అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దు.
సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు, ఫోటోలను జాగ్రత్తగా షేర్ చేయాలి.
తెలియని వ్యక్తుల వీడియో కాల్స్, ఫ్రెండ్ రిక్వెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే ఆఫర్లను నమ్మవద్దు.బ్యాంకు ఖాతా వివరాలు, వంటి రహస్య సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దు.

మోసానికి గురైతే వెంటనే స్పందించాలి

సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు సమాచారం అందించాలని, అలాగే సంబంధిత పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. మోసం జరిగిన వెంటనే స్పందించడం ద్వారా డబ్బును నిలిపివేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు."సైబర్ నేరాలను అరికట్టడంలో అప్రమత్తతే ప్రధాన ఆయుధం. విద్యార్థులు, యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ, ఆన్‌లైన్‌లో ప్రతి లావాదేవీ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి" అని అధికారులు సూచించారు.నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్, ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రజలు, విద్యార్థులు సైబర్ నేరాల బారిన పడకుండా నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ గారితో పాటు ఈశ్వర్, రాకేష్, అమీర్, శ్రీనివాసులు, కృష్ణమూర్తి మొదలగు జిల్లా సైబర్ క్రైమ్ బృందం పాల్గొన్నారు.

రూపాయికే లగ్నం!.. రూపాయే కట్నం!..

రూపాయిఫౌండేషన్ ఆధ్వర్యంలో!..

వరరామచంద్రాపురం, నవంబర్ 18 (ప్రజాజ్యోతి ప్రతినిధి) రూపాయికే లగ్నం, రూపాయేకట్నం, పట్నంలో పెళ్లి, తప్పక రండీ, అన్నీ మేమే భరిస్తాం, సామూహిక వివాహ మహోత్సవ కార్యక్రమం, డిసెంబర్ 19, వచ్చే నెల ఉదయం 11, గంటల 11, నిమిషాలకు, వివాహ వేదిక, లక్ష్మీ గార్డెన్, చంపాపేట, హైదరాబాద్, ఖర్చులు మేమే భరిస్తాం,అంటూ రూపాయి ఫౌండేషన్, చైర్మన్, నాగమల్ల అనిల్ కుమార్, డాక్టర్ వెంకట్ బాలగొని, సహాకారంతో, ఏ.ఎస్.డి. ఎస్, సంస్థ ఆధ్వర్యంలో, వికలాంగుల సంఘం కో ఆర్డినేటర్, నేరేడు రవి, నేపథ్యంలో, నూతనంగా వివాహ దంపతులకు విజ్ఞప్తి చేస్తున్నారు. బుధవారం, రేఖపల్లిలోని, వికలాంగుల కో ఆర్డినేటర్ రవి, నివాసంలో, ఈ సందర్భంగా, వారు మాట్లాడుతూ, రూపాయి ఫౌండేషన్, స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం,ప్రతీ ఏడాది నిర్వహిస్తున్నామని, చెప్పారు. రూపాయితో బంధం వందేళ్ల అనుబంధం, నిండునూరేళ్లు చల్లగాఉండాలని ఆయన సూచించారు. రానుపోనూ బస్సు ఏర్పాటు చేస్తామని,ఏలాంటి ఇబ్బందులు లేకుండా శురక్షితంగా సామూహిక వివాహాలు జరిపించి, మీ, మీ ఇంటివద్దే తీసుకుని వస్తామని, చెప్పారు. గ్రామాల్లో ఎవ్వారైనా వివాహాలు లేకుండా ఉంటే ఆధార్,కార్డు







తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, సూచించారు. వికలాంగుల కోఆర్డినేటర్ నేరేడు రవి, ని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో!...జిల్లాలో!...ఏం జరుగుతోంది!...

పాయం వెంకయ్యకు పట్టా భిషేకం ఖాయమా?
అదృష్టం తలుపు తట్టుతుందా?

వరరామచంద్రాపురం, నవంబర్ 18 (ప్రజాజ్యోతి ప్రతినిధి) నూతన పోలవరం జిల్లాలో జడ్పీ వైస్ చైర్మన్ పదవి, పాయం వెంకయ్య, కు ఖాయమని సంకేతాలు కనిపిస్తున్నాయి. రాజకీయ సమీకరణాలు, అనుభవం, వాగ్ధాటి, అన్నీ పాయం వెంకయ్యకు, కలిసొచ్చే అంశాలుగా కనిపిస్తున్నాయి. అందులో పోలవరం జిల్లాలోనే భారతీయ జనతా పార్టీకి ఏకైక జడ్పీ. టి.సి, కావడం విశేషం. ముఖ్యంగా ఇలాంటి డైనమిక్ నాయుడు, భారతీయ జనతా పార్టీకి, ప్రస్తుత తరుణంలో అవసరం ఎంతైనా ఉంది. ఏవిధంగా చూసినా సమర్థుడు, అసమాన ప్రతిభావంతులైన పాయం వెంకయ్య, రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం, ప్రత్యర్థులు వేసే రాజకీయ ఎత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనే ప్రతిభా శాలి. రాజకీయ సమీకరణాలు వేగంగా చేయడంలో ప్రత్యేక శైలి ఉంది. మాటకారి, నొప్పించక ఒప్పించే ధీశాలి. ఆయనకు రాజకీయ శత్రువులు ఎక్కువే? జడ్పీ వైస్ చైర్మన్ రేసులో అదృష్టం తలువుతడుతుందా? ఎన్నడూ లేని విధంగా విలీన మండలాల్లో చర్చ సాగుతోంది. భారతీయ జనతాపార్టీకి, మంచి నాయకత్వ లక్షణాలు, విలువలు, కలిగిన డైనమిక్ లీడర్ దొరికాడనడంలో ఏలాంటి సందేహం లేదు. రాజకీయ పండితులు, మేధా వివర్గాలు, విద్యావేత్తలు, అన్నీ రాజకీయ



పార్టీలు, ఏం జరుగుతుందాని 20 తారీకు కోసం రెప్పార్పకుండా చూస్తున్నారు. ఏజెన్సీ విలీన మండలాల ప్రజలు.

దివంగత ఉపాధ్యాయుడు కిష్టప్ప కోడలు.. సర్పంచ్ బరిలో గంగాదేవి ఆనందరాజ్

గ్రామాభివృద్ధే ప్రధాన లక్ష్యం..



కంబదూరు నవంబర్: 18 (ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్, కంబదూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల బరిలో తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థిగా గంగాదేవి ఆనందరాజ్ ప్రజల ముందుకు వస్తున్నారు. దివంగత ఉపాధ్యాయుడు కిష్టప్ప కోడలిగా, కుటుంబ పెద్దల ఆశీస్సులతో గ్రామ ప్రజల ఆదరాభిమానాలను కోరుతూ ఆమె ఎన్నికల ప్రచారానికి సిద్ధమయ్యారు. గ్రామ అభివృద్ధిని ప్రధాన అజెండాగా చేసుకుని ప్రజల మద్దతు కోరుతున్నారు.గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి వీధిలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడం, అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం, పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచడం, తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయడం తన ప్రధాన లక్ష్యాలని ఆమె పేర్కొంటున్నారు. అదేవిధంగా గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, గ్రామ పంచాయతీలోని గ్రామ ల ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ను సమర్థవంతంగా అమలు చేసేలా పనిచేస్తానని హామీ ఇస్తున్నారు.పదవుల కోసం కాకుండా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వస్తున్న తనకు గ్రామ ప్రజల అమూల్యమైన ఆశీస్సులు, ఆదరాభిమానాలు, మద్దతు అందించాలని గంగాదేవి ఆనందరాజ్ కోరుతు న్నారు. ప్రజల సహకారంతో కంబదూరు గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తన ఆకాంక్షగా వెల్లడిస్తున్నారు.

మావోయిస్టుల భారీ పేలుడు పదార్థాల డంప్ స్వాధీనం!

670 లైవ్ బీజీఎల్ షెల్స్ సహా భారీగా పేలుడు సామగ్రి పట్టివేత

ఏపీ--ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో పోలీసుల ప్రత్యేక ఆపరేషన్

నిల్వ కేంద్రాల గుర్తింపునకు నిరంతర గాలింపు: జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి





ఎటపాక, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): వామపక్ష తీవ్రవాద కార్యకలాపాల కట్టడికి ఆంధ్రప్రదేశ్ పోలీసులు చేపడుతున్న చర్యల్లో భాగంగా మావోయిస్టులకు చెందిన భారీ పేలుడు పదార్థాల రహస్య నిల్వ కేంద్రాన్ని భద్రతా బలగాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్--ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో పోలవరం జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి ఆదేశాలతో ప్రత్యేక పోలీసు బృందం, సీఆర్పీఎఫ్ బలగాల సహకారంతో నిర్వహించిన అంతర్రాష్ట్ర గాలింపు చర్యల్లో ఈ డంప్ బయటపడింది. గత ఏడాది నిర్వహించిన ఒక ఆపరేషన్‌లో మాడ్వి హిడ్మాకు చెందిన ఈఓఎఫ్ ను నిర్వీర్యం చేసిన నేపథ్యంలో, పోలీసులు నిరంతర నిఘా, సమాచార సేకరణను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో మావోయిస్టులు రహస్యంగా పేలుడు పదార్థాలను నిల్వ ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో కూనవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అనంతరం ప్రత్యేక బృందాలు సరిహద్దు ప్రాంతంలో గాలింపు చేపట్టి భారీగా పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. భద్రతా బలగాలు, రాజకీయ నాయకులను లక్ష్యంగా చేసుకుని ప్రాణనష్టం కలిగించే ఉద్దేశంతో మావోయిస్టులు ఈ పేలుడు పదార్థాలను ముందస్తుగా రహస్య ప్రాంతంలో దాచినట్లు ప్రాథమికంగా గుర్తించారు. డంప్‌లో 670 లైవ్ బీజీఎల్ షెల్స్, 42 నాన్ ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, 250 గ్రాముల గన్‌పౌడర్, 25 కార్డెక్స్ ముక్కలు, 12 బూస్టర్/ఎక్స్‌ప్లోజివ్ రింగులు, ఏడు లైవ్ భర్మార్ కార్ట్రిడ్జ్‌లు, 16 ఖాళీ 62 ఎంఎం కేసులు, సుమారు ఆరు మీటర్ల ఫ్యూజ్‌తో పాటు 20 రకాల అత్యవసర మందులు, వైద్య సామగ్రి, కిట్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఎటపాక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోలవరం జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి ఐపీఎస్ మాట్లాడుతూ.. పోలవరం జిల్లా పరిధిలోనే కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టులు దాచిన మిగిలిన సామగ్రి నిల్వ కేంద్రాలను సైతం నిరంతర గాలింపు చర్యల ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ 212వ బెటాలియన్ (కొంటా రేంజ్, ఛత్తీస్‌గఢ్ సెక్టార్) సెకండ్ ఇన్ కమాండ్ దినేష్ కుమార్, సీఆర్పీఎఫ్ కోబ్రా 204, 196వ బెటాలియన్లకు చెందిన దీపక్ కుమార్ గుర్వే, అభిషేక్ మిశ్రా, నీరజ్ కుమార్ సింగ్, సచిన్ కుమార్, రణవీర్ సింగ్ జాట్, హరీష్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. అలాగే సీఆర్పీఎఫ్ 141వ బెటాలియన్ సెకండ్ ఇన్ కమాండ్ ప్రీత సి., పోలవరం జిల్లా ఓఎస్ఓ (పరిపాలన, కార్యకలాపాలు) ఎం. జావళి అల్ఫోన్స్ ఐపీఎస్, చింతూరు సబ్ డివిజన్ ఏసీపీఓ కె. ఉదయ పావని, జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ సిఐ యం. కన్నపరాజు, ఎటపాక ఎస్సై జి. అప్పలరాజు తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో దోమతెరల పంపిణి.



ముత్తుకూరు, నవంబర్ 18(ప్రజా జ్యోతి) జాతీయ కీటక జినిత వ్యాధుల నియంత్రణ లో భాగంగా (ఎన్. వి.బి.డి.సి.పి) దోమల బారినుండి విద్యార్థులకు రక్షణ వలయం ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం దోమతెరలను పంపిణీ చేస్తుందని జిల్లా మలేరియా అధికారి ఎం.సింహాచలం తెలిపారు. బుధవారం ముత్తుకూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని 640 మంది విద్యార్థినులకు దోమతెరలు పంపిణీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ దోమతెరలు తయారీ విధానంలో మెడికేటెడ్ దారం వాడినందువలన దీనిపైన దోమ వాలదు. ఈ దోమతెరలు చాలా కాలము మన్నికగా ఉపయోగపడతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 185 హాస్టల్స్ లో 9475 దోమతెరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దోమల వలన వచ్చే వ్యాధుల నుంచి ఆరోగ్య భద్రత కొరకు తప్పకుండా దోమతెరలను వాడాలని సూచించారు. దీనివలన దోమలు కుట్టడం ద్వారా వచ్చే మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, బోదకాలు మెదడు వాపు వంటి వ్యాధులను అరికట్టేందుకు దోహదం చేస్తుందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల ఉధృతి తగ్గుతుందన్నారు. వైద్య ఆరోగ్య శాఖలోని కీటక జనిత వ్యాధులు విభాగము దోమలు పుట్టకూడదు దోమల కుట్టకూడదు అనే నినాదంతో విస్తృత కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ యు ఓ సుధాకర్ రెడ్డి, స్థానిక వైద్యాధికారులు సి.దేవికృప,సిహెచ్ చైతన్య రెడ్డి, ప్రిన్సిపాల్ సుజాత, ఆరోగ్య సహాయకులు బూదూరు బాలకృష్ణ,విద్యా కమిటీ చైర్మన్ నక్కా శ్రీధర్ పాల్గొన్నారు.

2026--27 విద్యా సంవత్సరానికి డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు



గుంతకల్లు నవంబర్ 18 (ప్రజా జ్యోతి): ఎస్ కే పి ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), గుంతకల్‌లో 2026--27 విద్యా సంవత్సరానికి బి. కామ్ (జనరల్, కంప్యూటర్ అప్లికేషన్, బిఎఫ్ ఎస్ ఐ), బీఎస్సీ (గణితం, కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ, బాటనీ,), బిఏ(ఎకనామిక్స్ హిస్టరీ, స్పెషల్ తెలుగు, స్పెషల్ ఇంగ్లీష్) కోర్సులలో ఖాళీగా ఉన్న సీట్లను కేటగిరి -బి (స్పాట్) అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపల్ డా. ఎ. లక్ష్మయ్య తెలి పారు. ముఖ్యమైన తేదీలు: - నోటిఫికేషన్: 17--18 నవంబర్ 2026 ఖాళీ సీట్ల ప్రదర్శన: 19 నవంబర్ 2026- దరఖాస్తుల స్వీకరణ: 19--22 నవంబర్ 2026, ఎంపిక జాబితా: 23 నవంబర్ 2026,- అడ్మిషన్ వివరాల అప్‌లోడ్: 24--26 నవంబర్ 2026 - ఫీజు చెల్లింపు: 26--27 నవంబర్ 2026 - సర్టిఫికెట్ల పరిశీలన: 25--27 నవంబర్ 2026, రాటిఫికేషన్: 30 నవంబర్ 2026, లోపాల సవరణ: 1--2 డిసెంబర్ 2026 - తుది రాటిఫికేషన్: 4 డిసెంబర్ 2026- పోర్టల్ ముగింపు: 5 డిసెంబర్ 2026 అర్హులైన విద్యార్థులు నిర్ణీత తేదీల్లో కళాశాలను సంప్రదించి స్పాట్ అడ్మిషన్ల ను సద్వినియోగం చేసుకో వాలని ప్రిన్సిపల్ సూచించారు.

అంగన్వాడీ పిల్లల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక శిక్షణ

పోషణ్ భీ పఢాయీ భీ రెండో విడత కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సీడీపీఓ వి. మల్లిక

తక్కువ ఖర్చుతో బోధనాభ్యసన సామగ్రి తయారీపై 85 మంది అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన








కూనవరం, నవంబర్ 18:(ప్రజా జ్యోతి ప్రతినిధి కిరణ్ బాబు) ఆరు సంవత్సరాల లోపు చిన్నారుల సమగ్ర అభివృద్ధి, సృజనాత్మక నైపుణ్యాల పెంపుదలే లక్ష్యంగా కూనవరం మండలంలోని 85 మంది అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ పఢాయీ భీ రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని సీడీపీఓ వి. మల్లిక ఆధ్వర్యంలో నిర్వహించారు. నవంబర్ 17, 18 తేదీల్లో కోతులగుట్టలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా సీడీపీఓ వి. మల్లిక మాట్లాడుతూ.. చిన్నారుల ప్రారంభ దశలోనే వారి శారీరక, మానసిక, సామాజిక, భాషా వికాసానికి అవసరమైన నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత అంగన్వాడీ కార్యకర్తలపై ఉందని వివరించారు. పిల్లల వయస్సుకు అనుగుణంగా ఆటపాటలు, సృజనాత్మక బోధనా పద్ధతుల ద్వారా అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని సూచించా రు. శిక్షణలో భాగంగా నవచేతన, ఆదర్శశిల కార్యక్రమాలపై కార్యకర్తలకు విస్తృత అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో స్థానికంగా లభించే వస్తువులతో బోధనాభ్యసన సామగ్రి తయారు చేయడం, వాటి ద్వారా పిల్లల్లోని వివిధ నైపుణ్యాలను వెలికితీయడం, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉపయోగపడే బోధ నోపకరణాల తయారీ, విని యోగంపై ప్రత్యేకంగా శిక్షణ అందించారు. బుధవారం నిర్వహించిన ముగింపు కార్య క్రమంలో కార్యకర్తలు స్వయంగా తయారు చేసిన బోధనా భ్యసన సామగ్రిని ప్రదర్శించారు. చిన్నారుల అభ్యసనకు ఉపయోగపడే వివిధ నమూనాలు, బోధనోపకరణాలను ప్రదర్శించడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో సీడీపీఓ వి. మల్లికతో పాటు సూపర్‌వైజర్లు నయోమి రాణి, వనజాక్షి, పద్మావతి, బీపీసీ శేఖర్, కార్యాలయ సిబ్బంది హరి, సాయమ్మ పాల్గొన్నారు. శిక్షణ నిర్వహణకు అవసరమైన తరగతి గదులు, టీవీలను ఏర్పాటు చేసి సహకరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధికకు సీడీపీఓ కృతజ్ఞతలు తెలిపారు.

11వ వార్డులో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

సంగాయిపేటలో స్వయంగా దోమల మందు పిచికారీ చేసిన కౌన్సిలర్ నాయబ్



ప్రజా జ్యోతి -- నందికొట్కూరు: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా 11వ వార్డు కౌన్సిలర్ నాయబ్ స్వయంగా రంగంలోకి దిగారు. నందికొట్కూరు పట్టణంలోని 11వ వార్డు సంగాయిపేట ప్రాంతంలో దోమల బెడదను అరికట్టేందుకు కౌన్సిలర్ నాయబ్ స్వయంగా దోమల నివారణ మందును పిచికారీ చేశారు. ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఆయన స్వయంగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.వార్డులోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడ నీరు నిల్వ ఉండటంతో దోమల వ్యాప్తి పెరిగే అవకాశం ఉందని గుర్తించిన కౌన్సిలర్ ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టారు. కేవలం అధికారులకు సూచనలు చేయడానికే పరిమితం కాకుండా, స్వయంగా పిచికారీ యంత్రాన్ని చేతబట్టి వీధుల్లో పర్యటిస్తూ దోమల మందు పిచికారీ చేశారు. నివాస ప్రాంతాలు, వీధులు, మురుగు కాలువల పరిసరాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నాయబ్ మాట్లాడుతూ.. వార్డు ప్రజల ఆరోగ్యం, సంక్షేమం తనకు అత్యంత ముఖ్యమని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వార్డులో పారిశుధ్య నిర్వహణకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. దోమల వల్ల డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరమని అన్నారు.ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మురుగు కాలువల్లో చెత్త వేయకుండా సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.వార్డులో ఏ సమస్య తలెత్తినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ 11వ వార్డును పరిశు భ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం అందుబాటులో ఉంటానని కౌన్సిలర్ నాయబ్ తెలిపారు.

ఆకలి తీరుద్దాం సేవా బృందం పామిడి

మానవ సేవే మాధవ సేవ

ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు ఈరోజు .నెహెమ్యా , .ఎస్తేరు వారి.రెండవ కుమారుడు సీయోను పుట్టినరోజు సందర్భంగా, పామిడిలోని మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు, వృద్ధులు మరియు నిరుపేదలకు ఈరోజు మధ్యాహ్నం ప్రేమతో ఆహారం అందించడం జరిగింది.చిన్నారి సీయోను పుట్టినరోజు వేడుకను పేదవారి ఆకలి తీర్చడం ద్వారా జరుపుకోవడం ఎంతో గొప్ప మానవత్వానికి నిదర్శనం. ఒకరి పుట్టినరోజు మరొకరి కడుపు నింపి, వారి ముఖాల్లో చిరునవ్వు తీసుకురావడం నిజమైన ఆనందం. ఈ మంచి సేవా కార్యక్రమానికి ముందుకొచ్చిన నెహెమ్యా ., ఎస్తేరు .మరియు వారి కుటుంబ సభ్యులకు ఆకలి తీరుద్దాం సేవా బృందం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు. చిన్నారి సీయోను ఆయురారోగ్యాలతో, దేవుని కృపతో, ప్రేమతో, మంచి భవిష్యత్తుతో ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము. ఆకలిగొన్నవారికి ఆహారం పెట్టుటే నిజమైన ప్రేమ... ఒకరి పుట్టినరోజు మరొకరి జీవితంలో చిరునవ్వుగా మారాలి సేవా బృందం సంప్రదింపు నంబర్లు: 93909 73692 93905 92963 7702504340 ఆకలి తీరుద్దాం సేవా బృందం పామిడి



అదానీ కృష్ణపట్నం పోర్ట్ లో 288 ఎలక్ట్రిక్ వాహనాల ప్రవేశం





ముత్తుకూరు, నవంబర్ 18 (ప్రజా జ్యోతి) అదాని కృష్ణపట్నం పోర్ట్ లో 2040 నాటికి కార్బన్ తటస్థతను సాధించాలని అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ దృష్టి పెట్టినట్లు ఏకేపీఎల్ యాజమాన్యం తెలియజేసింది.పర్యావరణ, సామాజిక మరియు పాలన సూత్రాలకు గ్రూప్ యొక్క నిబద్ధతకు అనుగుణంగా, అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ 288 ఎలక్ట్రిక్ వాహనాలను బుధవారం తన కార్యాచరణ సముదాయంలోకి చేర్చింది. ఈ పోర్ట్ లో 170 ఎలక్ట్రిక్ ట్రక్కులు, 108 లోడర్లు, 6 ఎక్స్కవేటర్లు మరియు 4 అంతర్గత బదిలీ వాహనాలు ఉన్నాయి. సమీప భవిష్యత్తులో అదనంగా 193 ఎలక్ట్రిక్ వాహనాలు ఈ సంస్థలో చేరనున్నాయి. సుస్థిరత ప్రయాణంలో భాగంగా, ఎకెపిఎల్ సంప్రదాయ డీజిల్-శక్తితో నడిచే పరికరాలను ఎలక్ట్రిక్ ప్రత్యామ్నాయాలతో దశలవారీగా భర్తీ చేయడం ప్రారంభించింది. ఈ వ్యూహాత్మక మార్పు కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, ఇంధన సామర్థ్యాన్ని పెంచడం తో పాటు ఓడరేవు కార్యకలాపాలకు పరిశుభ్రమైన మరియు పచ్చటి భవిష్యత్తును పెంపొందించడంలో ఓడరేవు యొక్క నిబద్ధతను బలోపేతం చేస్తుందని ఎకెపిఎల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జగదీష్ పటేల్ అన్నారు. ఎకెపిఎల్ యొక్క సుస్థిరత రోడ్మ్యాప్లో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. అలాగే ఆవిష్కరణ, పర్యావరణ నాయకత్వం మరియు కార్యాచరణ శ్రేష్ఠతపై దాని నిరంతర దృష్టిని ప్రతిబింబిస్తుంది. తన నౌకాశ్రమం క్రమక్రమంగా విద్యుదీకరించడం ద్వారా, ఎకెపిఎల్ తన పర్యావరణ పాదముద్రను తగ్గించడమే కాకుండా స్థిరమైన మరియు సమర్థవంతమైన ఓడరేవు కార్యకలాపాలకు కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోంది. ఈ ప్రయత్నాల ద్వారా, ఎకెపిఎల్ తన కార్బన్-న్యూట్రల్ భవిష్యత్తు వైపు స్థిరంగా ముందుకు సాగుతూ, తరువాతి తరం లాజిస్టిక్స్ మరియు సముద్ర మౌలిక సదుపాయాలకు శక్తిని అందిస్తోందని సీఈవో ఈ సందర్భంగా తెలిపారు.

రోడ్డుకు.. ఇరువైపుల కంప చెట్లు తొలగింపు



గుంతకల్లు నవంబర్ 18 (ప్రజా జ్యోతి): పట్టణంలోని 4వ వార్డులోని సోనియా గాంధీ కాలనీకి వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపులా ముళ్ళు పొదలు వేపుగా పెరిగి కాలనీలోకి వెళ్లే ప్రజలకు, వాహనదారులకు, ఇబ్బందిగా ఉండడంతో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన సోదరుడు గుంతకల్లు మండల ఇన్చార్జి గుమ్మనూరు నారాయణ స్వామి ఆ దేశాల వరకు 4వ వార్డు బిజెపి కౌన్సిలర్ మొండ్ల. మహాలక్ష్మి, సూచనలతో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు మొండ్ల కేశవ బుధవారం సోనియాగాంధీ కాలనీకి వెళ్లే రహదారిలో ఇరువైపుల ఉన్న కంపచెట్లను మున్సిపల్ జెసిబి తో తొలగించారు. కంపచెట్లు తొలగించడంతో కాలనీవాసులు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు వారి సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి కి, వార్డ్ కౌన్సిలర్ మహాలక్ష్మికి, కేశవ కు హర్షం వ్యక్తం చేశారు.

చీమలచెరువుపల్లెలో వైసీపీ సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ



అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలో 17 పంచాయతీలకు సంబంధించి జరిగిన నామినేషన్ల పరిశీలనలో చీమల చెరువుపల్లె వైసీపీ సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురైంది. అవసరమైన సరైన పత్రాలు సమర్పించక పోవడంతో నామినేషన్ను తిరస్కరించినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. మండలంలో వైసీపీ ఐదు పంచాయతీలకు నామినేషన్లు వేయగా, అందులో ఒకటి రిజెక్ట్ అయింది.

పొత్తు ధర్మంతోనే టిడిపికి మద్దతు బోయ సరోజ.



ప్రజా జ్యోతి న్యూస్ దేవనకొండ రిపోర్టర్ (రాఘవేంద్ర) దేవనకొండ సర్పంచ్ స్థానాన్ని జనసేన ఆశించడం తప్పు కాదని. అయితే కూటమి పొత్తులో భాగంగానే టిడిపికి మద్దతు తెలిపామని ఆలూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ జనసేన నాయకురాలు బోయ సరోజ తెలిపారు. డబ్బులకు అమ్ముడుపోయామని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇలాంటి ఆరోహణలో వాస్తవం లేదని. ఆధారాలు లేని ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. కూటమి ఐక్యతను కాపాడాలని సూచించారు

తాళ్లపూడి ఇన్‌చార్జ్ ఎంపీడీవో పై ఆరోపణలు

.విచారణకు డిమాండ్

తాళ్లపూడి, నవంబర్ 18 ,ప్రజాజ్యోతి న్యూస్ తాళ్లపూడి మండలంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో వ్యవహార శైలిపై కొందరు సిబ్బంది, ప్రజా ప్రతినిధుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు సమాచారం.మండలంలో పనిచేస్తున్న కొందరు పంచాయతీ సెక్రటరీలు, సిబ్బంది తమకు పని ఒత్తిడి ఎక్కువగా ఉంటోందని, తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నట్లు తెలిసింది. దీని వల్ల సిబ్బంది మనస్తాపానికి గురవుతున్నారని వారి సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.అలాగే ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో విధుల్లో ఉన్న కొందరు పారిశుద్ధ్య కార్మికులను ఇతర పనులకు వినియోగించారన్న ఆరోపణలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ప్రభుత్వ స్వచ్ఛతా వాహనాన్ని ఎన్నికల సమయంలో భోజన, వసతులకు వాడారన్న ఆరోపణలు కూడా కొందరు చేస్తున్నారు.ఈ ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలు తేల్చాలని, సిబ్బందికి, ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై స్పందించి విచారణ జరపాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎన్నికల ఏర్పాట్లు. జిల్లా పరిషత్ కార్యాలయంపై కలెక్టర్ దృష్టి

బాపట్ల నవంబర్ 18 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంతో పాటు జిల్లాలో పరిపాలనా మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం బాపట్ల మండలం బేతపూడిలో పర్యటించి ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. బేతపూడి పంచాయతీ పరిధిలోని 14 పోలింగ్ కేంద్రాల్లో పది సమస్యాత్మకమైనవి, నాలుగు తీవ్ర సమస్యాత్మకమైనవిగా గుర్తించిన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గత ఎన్నికల ఘటనలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని సూచించారు. బేతపూడి కేంద్రంగా వెదుళ్లపల్లి, బేతపూడి, స్టువార్టుపురం పంచాయతీల నామినేషన్లకు ఏర్పాట్లు చేయాలన్నారు. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో పేరలి కెనాల్ పూడికతీత పనులను వేగవంతం చేయాలని, భారీ వర్షాలతో నీరు నిలిచిపోకుండా కాల్వను శుభ్రం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. విపత్తులు సంభవించక ముందే ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు నష్టం



కలగకుండా చూడాలన్నారు.అనంతరం జిల్లా పరిషత్ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్ పెయింటింగ్, మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టే సమయానికి కార్యాలయం సిద్ధంగా ఉండాలన్నారు. కలెక్టరేట్ ఆవరణలోని ఖాళీ స్థలంలో నూతన జిల్లా పరిషత్ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.ఈ పర్యటనలో బాపట్ల ఆర్డీఓ హరి కుమార్, డీడీఓ పద్మజ, ఆర్ అండ్ బీ డీఈ అరుణకుమారి, తహసీల్దార్ షాలిమా తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల రుణం తీర్చుకునే బాధ్యత నాది

పేర్ల సునీల్‌తో అభివృద్ధి, మెరుగైన పాలనకు హామీ.

అధికార, ప్రతిపక్షాల చీకటి ఒప్పందంపై అన్నం సతీష్ ధ్వజం.

బాపట్ల, నవంబర్ 18 (ప్రజాజ్యోతి జిల్లా ప్రతినిధి): బాపట్ల మున్సిపల్ ఎన్నికల వేళ మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు పట్టణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య చీకటి ఒప్పందాలు జరుగుతున్నాయంటూ ప్రశ్నించిన ఆయన, బాపట్ల అభివృద్ధి కోసం స్వతంత్ర అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని కాపు కళ్యాణ మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన తన రాజకీయ వైఖరిని స్పష్టం చేశారు.వార్డుల విభజనలో శాస్త్రీయమైన విధానం పాటించలేదని, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్ణయాలు తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్థానిక ప్రజల అవసరాలు, ప్రాంతీయ పరిస్థితులకు అనుగుణంగా వార్డుల విభజన జరగాల్సి ఉందన్నారు. ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యత ఇవ్వకుండా రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని విమర్శించారు.బాపట్ల తనకు ఎంతో ఇచ్చిందని, ఈ ప్రాంతానికి తిరిగి సేవ చేయకపోతే తన బాధ్యత నెరవేర్చినట్లు కాదని అన్నం సతీష్ వ్యాఖ్యానించారు. బాపట్ల అభివృద్ధికి తన వంతు కృషి చేయాలనే సంకల్పంతోనే



పేర్ల సునీల్ కుమార్‌ను స్వతంత్ర చైర్మన్ అభ్యర్థిగా బలపరిచినట్లు తెలిపారు. ఆయనను గెలిపించి పట్టణ ప్రజలకు మెరుగైన, ప్రజలకు అందుబాటులో ఉండే పరిపాలన అందిస్తానని ప్రకటించారు.ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకునే స్థానిక అభ్యర్థులనే ప్రజలు ఆదరించాలని కోరారు. తాను బలపరిచిన స్వతంత్ర అభ్యర్థులను ఎన్నికల సమయంలో ఇబ్బందులకు గురిచేయాలని ప్రయత్నిస్తే సహించేది లేదని, అవసరమైతే గట్టిగా పోరాటం చేస్తానని హెచ్చరించారు. బాపట్ల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని అన్నం సతీష్ ప్రభాకర్ స్పష్టం చేశారు.

నేడు పొందూరు మండల పరిషత్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ : పొందూరు మండల పరిషత్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమం నేడు గురువారం నాడు ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్. వాసుదేవరావు తెలిపారు.కార్యక్రమంలో భాగంగా తొలుత కోఆప్షన్ సభ్యుల ఎన్నిక నిర్వహించనున్నామన్నారు.అనంతరం ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీటీసీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించనున్నామని , ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ), ఉపాధ్యక్షులు (వైస్ ఎంపీపీ) ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెల్లడించారు. ఈ ఎన్నికలతో పొందూరు



మండల పరిషత్ నూతన పాలకవర్గం అధికారికంగా బాధ్యతలు చేపట్టనున్నారని పేర్కొన్నారు.

.దేవనకొండ జడ్పీటీసిగ డాక్టర్ షేక్ షాదికకు ధ్రువీకరణ పత్రం.



ప్రజా జ్యోతి న్యూస్ దేవనకొండ రిపోర్టర్ (రాఘవేంద్ర).దేవనకొండ జడ్పీటీసీగా విజయం సాధించిన టిడిపి నాయకురాలు డాక్టర్ షేక్ షాధికా సర్టిఫికెట్. ఐడి కార్డు. అందుకున్నారు. బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో సీఈవో ఆర్ సుధాకర్ రెడ్డి ఆమెకు ధ్రువీకరణ పత్రం తో పాటు ఐడి కార్డులు అందజేశారు. జెడ్పీటీసిగా ఎన్నికైన అనంతరం అధికారికంగా సర్టిఫికెట్ అందుకున్నారు. దేవనకొండ మండలానికి ప్రాతినిధ్యం వహించిన డాక్టర్ షేక్ షాదికకు టిడిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

కౌతాళంలో నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ శ్రీనివాసులు!

ఎన్నికల నిర్వహణపై పోలీసుల ప్రత్యేక నిఘా..

భద్రతా ఏర్పాట్లపై అధికారులకు తగు సూచనలు



కౌతాళం, నవంబర్ 18 (ప్రజా జ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కౌతాళం మండలంలో నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న సందర్భంగా పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ప్రకాష్ కుమార్ కౌతాళం మండలంలోని నామినేషన్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ జరుగుతున్న తీరును, కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి సూచించారు. నామినేషన్ల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఈ పర్యటన ద్వారా స్పష్టమవుతోంది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు దుకాణాల భద్రతపై ఎస్పీ ప్రత్యేక దృష్టి

దొంగతనాలకు ముందే అడ్డుకట్ట వేయాలి. వ్యాపారులకు భద్రతా సూచనలు

సీసీ కెమెరాలు, అలారం వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవాలి. ఎస్పీ బి.ఉమామహేశ్వర్



బాపట్ల నవంబర్ 18 (ప్రజాజ్యోతి జిల్లా ప్రతినిధి) బంగారం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఆభరణాల దుకాణాల భద్రతపై వ్యాపారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ సూచించారు. దొంగతనాల నివారణకు ముందస్తు జాగ్రత్తలే కీలకమని, ప్రతి బంగారు, వెండి ఆభరణాల దుకాణంలో అత్యాధునిక సీసీ కెమెరాలు, బర్గర్ అలారం వ్యవస్థలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం బాపట్లలోని జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో బంగారు, వెండి వ్యాపారులు, పాన్ బ్రోకర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 257 బంగారు, వెండి ఆభరణాల దుకాణాలను గుర్తించినట్లు తెలిపారు. ప్రతి దుకాణంలో లోపలి, వెలుపలి ప్రాంతాలు, కౌంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌లు స్పష్టంగా కనిపించేలా నాణ్యమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాత్రి వేళల్లోనూ స్పష్టమైన దృశ్యాలు నమోదయ్యేలా నైట్ విజన్ కెమెరాలు వినియోగించాలని, సీసీ కెమెరాల డీవీఆర్‌ను సురక్షిత ప్రాంతంలో భద్రపరచాలని సూచించారు. దొంగతనాలను ముందుగానే గుర్తించే బర్గర్ అలారం వ్యవస్థలు కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు.సరైన ఆధారాలు లేకుండా ఎవరైనా బంగారం, వెండి ఆభరణాలు విక్రయించేందుకు వస్తే కొనుగోలు చేయరాదని వ్యాపారులను ఎస్పీ హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు గుర్తించినా, ఏదైనా అనుమానాస్పద ఘటన జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. దొంగతనం జరిగిన తర్వాత నష్టపోవడం కంటే ముందుగానే భద్రతా చర్యలు తీసుకోవడం మేలని పేర్కొన్నారు.జిల్లాలో అత్యాధునిక మొబైల్ ఫోరెన్సిక్ యూనిట్ అందుబాటులో ఉందని, ఇటీవల కర్లపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన బంగారు ఆభరణాల దొంగతనం కేసును వేగంగా ఛేదించి నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన బిల్ తెగకు చెందిన కొందరు దొంగలను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నేరం జరిగిన తర్వాత నిందితులను గుర్తించడం, చోరీ సొత్తును రికవరీ చేయడం సవాలుతో కూడుకున్నదని, వ్యాపారులు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ భద్రతా ప్రమాణాలు పాటిస్తే నేరాలను ముందుగానే అరికట్టవచ్చని వివరించారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఎల్.సుధాకర్, బాపట్ల, చీరాల డీఎస్పీలు సి. హెచ్.చంద్రమౌళి, ఎం.డి.మోయిన్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ వి.సూర్యనారాయణ, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.సురేష్, కె.వి.బ్రహ్మయ్య, వి.శ్రీను, జిల్లాలోని బంగారు, వెండి వ్యాపారులు, పాన్ బ్రోకర్లు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొట్టమొదటి సారిగా ప్రజాపరిషత్ కార్యాలయంపై పసుపుజెండా!..

ప్రజల మద్దతు గొంది చంద్రయ్యకే!..
పార్టీల మద్దతు గొంది చంద్రయ్యకే!..







వరరామచంద్రాపురం, నవంబర్ 18 (ప్రజాజ్యోతి ప్రతినిధి) తెలుగుదేశం, జనసేన, సి.పి.ఎం, పార్టీ, ఏకా భిప్రాయంతో ఇరు పార్టీల మద్దతు రావడంతో, కూటమి, అభ్యర్థి గొంది చంద్రయ్యకే, మద్దతు తెలిపారు. ఎం.పి.పి.గా పీఠం, ఆయనకె దక్కింది. సుదీర్ఘరాజకీయ అనుభవానికే పట్టం కట్టారు. గొంది చంద్రయ్య, తెలుగుదేశం పార్టీకి, ఎనలేని సేవలందించారు. ఏజెన్సీ పల్లెల్లో, గొంది చంద్రయ్యకు, బలగం దండి గానే ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంనుండి తెలుగు దేశం పార్టీలో ఉంటూ పార్టీ కష్టకాలంలో అండగా నిలిచి ప్రజల పక్షాన ఉన్నారు. సీనియర్ నాయకుడుగా పార్టీకి కష్టపడి పని చేసి ప్రజల మన్ననలు పొందారు. మాస్ లీడర్ గా మంచి పేరు ప్రతిష్టలు, కూడ గట్టుకున్నారు. వడ్డిగూడెం, ఎం. పి. టి.సి, ఎన్నికల్లో భారీ విజయాన్ని నమోదు చేశారు. వరరామచంద్రాపురం, తెలుగుదేశం పార్టీకి, కంచుకోటని, మరో మారు నిరూపించారు. ఏజెన్సీ విలీన మండలమైన వరరామచంద్రాపురం, మన పల్లెసీమ భవిష్యత్ ను,మార్చే మహోత్తరమైన కార్యక్రమానికి అడుగు వేశారు.మనఊరు బాగుండాల నేసంకల్పంతో, వరరామచంద్రాపురం, మండల ప్రజా పరిషత్ ప్రతినిధిగా పసుపు జెండా రెపరెపలాడించారు. గ్రామాల అభివృద్ధికి, పల్లె ప్రగతికి, శ్రీ కారం చుట్టారు. ఎం.పి.పి. గా, పాలనకు సిద్ధపడ్డారు. ఏది ఏమైనాచరిత్ర తిరగ రాశారు. పార్టీలు ఏవైనా గొంది చంద్రయ్యకే, జై కొట్టారు. ప్రజాజ్యోతి, తరుపున శుభాకాంక్షలు, గాడ్ బ్లేస్ యూ,!..

సోషల్ ఆడిట్ ను బహిష్కరించండి

-ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు.



బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ నవంబర్ 18 (ప్రజా జ్యోతి) పాఠశాలల్లో ఒకవైపు సంగ్రహణాత్మక మూల్యాంకన పరీక్షలు, మరోవైపు ఎన్నికల శిక్షణలు, విధులు, సెన్సెస్-2027 శిక్షణ జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 20వ తేదీ నుండి పాఠశాలల్లో నిర్వహించ తలపెట్టిన సామాజిక ఆడిట్ షెడ్యూల్ ను వాయిదా వేయాలని ఉపాధ్యాయ సంఘాలు చేసిన విజ్ఞప్తిని సర్వ శిక్ష అధికారులు పెడచెవిన పెట్టినందున జిల్లా వ్యాప్తంగా ఆడిట్ కార్యక్రమాన్ని బహిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఉపాధ్యాయులకు పిలుపునిచ్చింది. బుధవారం సాయంత్రం కడపలోని యుటిఎఫ్ భవన్లో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బాబు పద్మాకర్, ఏపీటీఎఫ్ (1938) జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.అబ్దుల్లా, ఏపీటీఎఫ్ (257) జిల్లా నాయకులు నరసింహులు, ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, పిఆర్టీయూ జిల్లా నాయకులు మధుసూదన రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో ఇప్పటికే సంగ్రహణాత్మక మూల్యాంకన పరీక్షలు జరుగుతున్నాయని, మరోవైపు గ్రామపంచాయతీ ఎన్నికల విధులు, శిక్షణా తరగతులు, సెన్సెస్-2027 శిక్షణా తరగతుల నిర్వహణ కొనసాగుతున్నాయన్నారు . ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులంతా తీవ్రమైన పని భారంతో విధులు నిర్వహిస్తుండగా మరోవైపు సర్వ శిక్ష అధికారులు ఈనెల 20వ తేదీ నుండి పాఠశాలలకు సామాజిక ఆడిట్ షెడ్యూల్ ను ప్రకటించారన్నారు. ఏక సమయంలో పలు విధులు ఉపాధ్యాయులు నిర్వహించలేని కారణంగా ఆడిట్ షెడ్యూల్ ను డిసెంబర్ రెండవ వారానికి వాయిదా వేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సర్వ శిక్ష ఏపీసీతో పాటు, డీఈవో, జిల్లా రెవెన్యూ అధికారి వారిని కోరామన్నారు. డిఆర్ఓ తో పాటు, డీఈఓ ఆడిట్ షెడ్యూల్ ను వాయిదా వేయించాలని సర్వ శిక్ష ఏపిసికి సూచించినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. అధికారుల వైఖరి వల్ల క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. దీంతోపాటు ఆడిట్ ను తాలూకా కేంద్రాల్లో కాకుండా, మండల కేంద్రాల్లో నిర్వహించాలని, పాఠశాల గ్రాంట్స్ బిల్లుల సమర్పణ విధానాన్ని సరళీకృతం చేయాలని కోరినప్పటికీ అధికారుల నుండి ఎలాంటి స్పందన లేదన్నారు. ఈ నేపథ్యంలో 20వ తేదీ నుండి జరగబోయే సామాజిక ఆడిట్ కార్యక్రమాన్ని బహిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పక్షాన ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. అధికారుల తీరు మారకపోతే భవిష్యత్తులో ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకుంటామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు ఎస్.ఏజాస్ అహ్మద్, గుర్రయ్య, సాదిక్ అలీ, జి.గోపీనాథ్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో నిబంధనలు కఠినతరం చేయాలి.

ఆలమూరు నవంబర్ 18(ప్రజాజ్యోతి):ఇటీవల జరిగిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల వలె కాకుండా రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మండలంలోని జొన్నాడ గ్రామానికి చెందిన గంటా మనోహర్‌దాస్ కోరారు.ఈ మేరకు ఆయన ఎంపీడీవో ఏ రాజుకు వినతిపత్రం సమర్పించారు.ఈ నెల 5న జరిగిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్.ఈ.సి.) నిబంధనలను రాజకీయ నాయకులు పూర్తిగా ఉల్లంఘించారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వందలాది మంది నాయకులు పోలింగ్ బూత్‌లలోకి ప్రవేశించి, బ్యాలెట్ పెట్టెల కౌంటర్ల వద్దకు వెళ్లి ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారని తెలిపారు.అంతేకాకుండా, ఆ సమయంలో అధికారులు, పోలీసులు ఉన్నప్పటికీ ఈ అక్రమాలను నియంత్రించలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇదే పరిస్థితి కొనసాగితే, ఈ నెల 29న జరగబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గొడవలు జరిగే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. కావున అధికారులు తక్షణమే స్పందించి రాబోయే పంచాయతీ ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు పునరావృతం కాకుండా అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, ఎన్నికల నిబంధనలను కఠినంగా అమలు చేయాలని మనోహర్‌దాస్ విజ్ఞప్తి చేశారు.



గ్రామాలలో నామినేషన్ వేస్తున్న వార్డ్,సర్పంచ్ అభ్యర్థులకు రక్షణ కల్పించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కి వైస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి ఫిర్యాదు



గుంతకల్లు నవంబర్ 18 (ప్రజాజ్యోతి): గుంతకల్లు నియోజకవర్గంలో పలుచోట్లా గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలలో టీడీపీ ముకలు వైస్సార్సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా బెదిరింపులు, దాడులు చేస్తున్న వారిపైన వెంటనే చర్యలు తెలుసుకొని గ్రామాలలో నామినేషన్ వేస్తున్న వార్డ్,సర్పంచ్ అభ్యర్థులకు పోలీస్ లు, అధికారుల చేత రక్షణ కలిపించి నామినేషన్లు వేయించాలని కోరుతూ వైస్సార్సీపీ గుంతకల్లు నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు,ఇంచార్జ్ వై.వెంకటరామి రెడ్డి ఆదేశాలు మేరకు బుధవారం అనంతపురం జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ కార్యాలయంలో వైస్సార్సీపీ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు వై.నైరుతి రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చుక్కలూరు దిలీప్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పిర్యాదు చేయటం జరిగింది.

ఆలమూరు మండలంలో 46 నామినేషన్లు దాఖలు,సర్పంచ్ స్థానాలకు 14.. వార్డు సభ్యుల స్థానాలకు 32 నామినేషన్లు.



ఆలమూరు, నవంబర్ 18 (ప్రజాజ్యోతి):ఆలమూరు మండలంలో ఈ నవంబర్ నెల 29వ తేదీన ఫేజ్--2లో భాగంగా జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాఖలు ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా నవంబర్ 18వ తేదీ ఒక్కరోజు మండల పరిధిలోని ఏడు గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు కలిపి మొత్తం 46 నామినేషన్లు దాఖలైనట్లు ఆలమూరు మండల అభివృద్ధి అధికారి (ఎండిఓ) ఏ. రాజు వెల్లడించారు.వీటిలో సర్పంచ్ పదవులకు 14 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 32 నామినేషన్లు అందినట్లు తెలిపారు.

గ్రామాల వారీగా నామినేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి:
- బడుగువానిలంక: సర్పంచ్ -- 1, వార్డు సభ్యులు -- 2.
- చొప్పెల్ల: సర్పంచ్ -- 3, వార్డు సభ్యులు -- 7.
- జొన్నాడ: సర్పంచ్ -- 1, వార్డు సభ్యులు -- 1.
- కలవచర్ల: సర్పంచ్ -- 2.
- మడికి: సర్పంచ్ -- 3, వార్డు సభ్యులు -- 8.
- మూలస్థాన అగ్రహారం: సర్పంచ్ -- 2.
- సూర్యారావుపేట: సర్పంచ్ -- 2, వార్డు సభ్యులు -- 14.

పై ఏడు గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు కలిపి 46 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియలను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ఎన్నికల షెడ్యూల్ ప్రకారం అధికారులు నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రక్రియలో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్యాపిలి మండలంలో నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్



ప్రజా జ్యోతి న్యూస్ ప్యాపిలి, నవంబర్ 18 ప్యాపిలి మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియ కొనసాగుతున్న సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్ వివిధ గ్రామాల్లోని నామినేషన్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. వెంగళంపల్లె, స్వర్ణ గ్రామం, పోదొడ్డి, ప్యాపిలి క్లస్టర్ పరిధిలోని నామినేషన్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పోదొడ్డి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా భోజన నాణ్యత, వంటకాల తయారీ, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అలాగే వెంగళంపల్లె గ్రామంలో ప్రతి బుధవారం నిర్వహించే ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో పాల్గొని, చిన్నారులకు అందిస్తున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు తగిన సూచనలు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని, ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై విద్యుత్ ఉద్యోగుల గళం

విద్యుత్ రంగ ప్రైవేటీకరణను తక్షణమే విరమించుకోవాలి

‘చలో ఢిల్లీ’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మిక సంఘాల పిలుపు



బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ నవంబర్ 18 (ప్రజా జ్యోతి) కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని, విద్యుత్ రంగ ప్రైవేటీకరణ ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో నిర్వహించనున్న ‘చలో ఢిల్లీ’ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం బద్వేల్ సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో ఘనంగా ఆవిష్కరించారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఏపీ ఎస్పీడీసీఎల్ డిస్కం అధ్యక్షులు బి. నాయబ్ రసూల్, డిస్కం సహాయ కార్యదర్శి నాగరాజు, మైదుకూరు డివిజన్ ట్రెజరర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కోట్లాది మంది కార్మికులు, ఉద్యోగులు దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చిందని విమర్శించారు. వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, విద్యుత్ రంగ ప్రైవేటీకరణతో పాటు స్మార్ట్ మీటర్ల విధానాన్ని విరమించుకోవాలని కోరారు. ఈ విధానాలు అమలైతే పేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం మరింత పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కార్మికులందరికీ చట్టబద్ధమైన కనీస వేతనం, సామాజిక భద్రత, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో నిర్వహించనున్న ‘చలో ఢిల్లీ’ కార్యక్రమాన్ని కార్మికులు, విద్యుత్ ఉద్యోగులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించాలని, పెండింగ్ డీఏ విడుదల చేయాలని, నూతన నియామకాలు చేపట్టాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. టాటా ఏఐజీ వైద్య బీమా పాలసీని రద్దు చేసి, దాని స్థానంలో ఉద్యోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మైదుకూరు డివిజన్ నాయకులు సుబ్బారావు, జీవి సుబ్బయ్య, శివరాం కుమార్, చిన్ని కృష్ణ, అబ్దుల్ వల్లి, పెంచలయ్య, ప్రశాంత్, దినేష్ రెడ్డి, మల్లికార్జున, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కౌతాళంలో సర్పంచ్ అభ్యర్థి గాండ్ల శ్రీయ పర్యటనకు ప్రజల స్పందన











వివిధ వీధుల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్న శ్రీయ..

ఆలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళం

కౌతాళం, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): కౌతాళం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా అధికార కూటమి బలపరిచిన శ్రీమతి గాండ్ల శ్రీయ గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఉరుకుంద ఈరన్న మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ చెన్న బసప్ప సతీమణి అయిన శ్రీయ వివిధ వీధుల్లో ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వడ్డే వీధిలో ఆత్మీయ సమావేశం పర్యటనలో భాగంగా వడ్డే వీధిలో వడ్డే రాజులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను, గ్రామ అభివృద్ధిపై తమ అభిప్రాయాలను తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేసుకుంటూ ముందుకు సాగుతానని శ్రీయ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వడ్డే రాజులు ఆమెకు స్వాగతం పలికి తమ మద్దతు తెలిపారు. మారెమ్మవ్వ, జంబులమ్మ దేవస్థానానికి రూ.50 వేల విరాళం అనంతరం బుడగ జంగాల వీధిలోని శ్రీ మారెమ్మవ్వ, శ్రీ జంబులమ్మ అవ్వ దేవస్థానాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కోసం రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. దేవస్థానానికి భవిష్యత్తులోనూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. గెలిచిన వెంటనే నీటి సమస్య పరిష్కరిస్తా బుడగ జంగాల వీధిలో నెలకొన్న తాగునీటి సమస్యను కాలనీ పెద్ద జంబయ్య శ్రీయ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆమె, ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే గ్రామంలోని నీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలు తీర్చడం తన బాధ్యతగా భావిస్తానని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ప్రజలు తమ సమస్యలను అభ్యర్థి దృష్టికి తీసుకురాగా, ఆమె వాటిని సావధానంగా విన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చౌదరి బసవరాజు, టీడీపీ సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం రాజు, రాజబాబు, చిరంజీవి, భీమయ్య, జనసేన నాయకులు రామాంజనేయులు, రాంబాబు, స్వామిదాస్, దేవదాస్, బుడగ జంగాల కాలనీ పెద్దలు పెద్ద జంబయ్య, రజనీకాంత్, ఎల్లప్ప, చిన్న జంబయ్యతో పాటు గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

కంబదూరు సర్పంచ్ అభ్యర్థి కిరణ్ కుమార్ విజయానికి సమష్టిగా కృషి చేయండి

వైసీపీ నాయకులు, కార్యకర్తలకు మాజీ ఎంపీ తలారి రంగయ్య పిలుపు



లకంబదూరు నవంబర్ 18 (ప్రజాజ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్: కంబదూరు మేజర్ గ్రామపంచాయతీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి భోగం కిరణ్ కుమార్ విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని మాజీ ఎంపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త తలారి రంగయ్య పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి కిరణ్ కుమార్ గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులతో కలిసి కళ్యాణదుర్గంలోని పార్టీ కార్యాలయంలో తలారి రంగయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో పలు స్థానిక రాజకీయ అంశాలపై చర్చించారు .అనంతరం తలారి రంగయ్య మాట్లాడుతూ.. పార్టీ బలపరిచిన అభ్యర్థి కిరణ్ కుమార్ విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా తీసుకొని క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. గ్రామ అభివృద్ధిని కాంక్షిస్తూ కిరణ్ కుమార్‌కు ప్రజల మద్దతు కూడగట్టేందుకు పార్టీ శ్రేణులంతా ఐక్యంగా కృషి చేయాలని కోరారు. కంబదూరు మేజర్ పంచాయతీలో కిరణ్ కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎరువుల బుకింగ్‌కు ప్రత్యేక సహాయ కేంద్రం

ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌పై రైతులకు ఉచిత అవగాహన, సహకారం



ప్రజా జ్యోతి -- నందికొట్కూరు: రైతులకు ఎరువుల బుకింగ్ ప్రక్రియను సులభతరం చేసేందుకు నందికొట్కూరు పట్టణంలోని శ్రీ లక్ష్మీ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో ప్రత్యేక ఎఫ్ఎఫ్ఎస్ రైతు సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో రైతులకు ఫార్మర్ ఐడీ నమోదు, యాప్ రిజిస్ట్రేషన్, భూమి వివరాల పరిశీలనతో పాటు ఎరువుల ఆన్‌లైన్ బుకింగ్ వరకు ఉచితంగా సహకారం అందించనున్నారు.రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, మొబైల్ నంబర్‌తో కేంద్రాన్ని సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. సహాయ కేంద్రం అసిస్టెంట్ గుజ్జుల గణేష్ నాయుడు రైతులకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తారు.

సంప్రదించవలసిన నంబర్: 8971982531

మూడు పార్టీల మధ్య కుదిరిన పొత్తు!.. ఎం.పీ.పీ, పీఠం తెలుగుదేశం పార్టీకి!..

నేడు గురువారం ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేయనున్న టీడీపీ సీనియర్ నేత గొంది చంద్రయ్య!..



వరరామచంద్రాపురం,నవంబర్ 18(ప్రజాజ్యోతి ప్రతినిధి)మండల పరిషత్ అధ్యక్ష పదవిపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. సీ.పీ.ఎం, పార్టీ,తెలుగుదేశం పార్టీ,జనసేన పార్టీల,మధ్య రాజకీయ ఒప్పందం కుదరడంతో ఎం.పీ.పీ, పీఠం, తెలుగుదేశం పార్టీకి దక్కనుంది. ఈ మేరకు తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకుడు గొంది చంద్రయ్య, గురువారం, ఎం.పీ.పీ.గా, ప్రమాణ స్వీకారం చేయనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల అనంతరం మండల పరిషత్ అధ్యక్ష పదవిని దక్కించుకునేందుకు వివిధ రాజకీయపార్టీలు తమదైన వ్యూహాలతో ముందుకు సాగాయి ఈనేపథ్యంలో సీ.పీ.ఎం,పార్టీ, తెలుగుదేశం పార్టీ,జనసేన పార్టీ,నాయకుల మధ్యజరిగిన చర్చలు సఫలమై పొత్తుకుమార్గం సుగమమైంది. మూడుపార్టీలమధ్య కుదిరిన పరస్పర అంగీకారంతో ఎం.పీ.పీ పదవికి,తెలుగుదేశం పార్టీఅభ్యర్థిగా గొంది చంద్రయ్యకు,అవకాశం లభించింది.నేడు గురువారం జరగనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమంతో మండల పరిషత్ పాలనలో కొత్తఅధ్యాయం ప్రారంభంకానుంది. ఈపరిణామం మండలరాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.కూటమి పార్టీలమధ్యకుదిరిన ఈరాజకీయ సమన్వయం భవిష్యత్తులో మండలఅభివృద్ధి కార్యక్రమాలకు ఏమేరకు దోహదపడుతుందో వేచి చూడాలి.రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి.ఏది ఏమైనా తెలుగుదేశం పార్టీకె ఎం.పి.పి,పదవి ఖాయంగా మారింది.

జాతీయ జల అవార్డుల పరిశీలనకు కేంద్ర బృందం పర్యటన

బేతంచర్ల, డోన్ మండలాల్లో నీటి శుద్ధి కేంద్రాలు, సూక్ష్మ సేద్య పరికరాల పరిశీలన



బేతంచర్ల:నవంబర్18,(ప్రజా జ్యోతి) జాతీయ జల అవార్డుల పరిశీలనలో భాగంగా కేంద్ర పరిశీలకుల బృందం బేతంచర్ల, డోన్ మండలాల్లో పర్యటించారు. ఈ బృందంలో ఆర్. రామ్ ప్రసాద్, కార్యనిర్వాహక ఇంజనీరు, నాగార్జున పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా తొలుత నంద్యాల జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలో నీటి సంరక్షణ, నీటి నిర్వహణకు సంబంధించి చేపడుతున్న కార్యక్రమాల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం బుగ్గన నీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించి శుద్ధి ప్రక్రియను పరిశీలించారు. తదుపరి బుగ్గానిపల్లి తండాలోని నీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించి అక్కడి పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చేపడుతున్న చర్యలపై అధికారులతో చర్చించారు. అలాగే వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సూక్ష్మ సేద్య పరికరాలను పరిశీలించి వాటి వినియోగం, రైతులకు కలుగుతున్న ప్రయోజనాలపై ఆరా తీశారు.అనంతరం ఆర్.ఎస్. రంగాపురం గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా అమలవుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యానవన రైతులతో సమావేశమై పంటల సాగు, నీటి పొదుపు పద్ధతులు, సూక్ష్మ సేద్య విధానాల వినియోగంపై చర్చించారు. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పథకాల ద్వారా పొందుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు.ఈ పర్యటనలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యనారాయణ, బేతంచర్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఫజల్ రహిమాన్, అదనపు కార్యక్రమ అధికారులు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, జల గ్రిడ్ విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు, సహాయ ఇంజనీర్లు, సూక్ష్మ సేద్య విభాగం ప్రాజెక్టు డైరెక్టర్, సహాయ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో నీటి వనరుల సంరక్షణ, తాగునీటి సరఫరా, సూక్ష్మ సేద్య పద్ధతుల అమలు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల పురోగతిని కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది.

పొందూరు మండలంలో ప్రారంభమైన సర్పంచ్ నామినేషన్ల సందడి

– లోలుగు, కేశవదాసుపురం గ్రామాల్లో కూటమి అభ్యర్థుల నామినేషన్లు

– మద్దతుగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు







పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్: పొందూరు మండలంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల సందడి నెలకొంది. ఫేజ్-2 ఎన్నికల ప్రక్రియలో భాగంగా బుధవారం నుంచి మూడు రోజుల పాటు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. సర్పంచ్ అభ్యర్థులతో పాటు వార్డు సభ్యుల అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. పలు గ్రామాల్లో కూటమి తరుపున అభ్యర్థులు నామినేషన్లు సమర్పించగా, వారికి మద్దతుగా ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

లోలుగులో కూటమి సర్పంచ్ అభ్యర్థిగా లోలుగు కామరాజు నామినేషన్

మండలం లోలుగు గ్రామంలో కూటమి తరుపున సర్పంచ్ అభ్యర్థిగా లోలుగు కామరాజు లోలుగు జెడ్పీ హై స్కూల్ లో తన నామినేషన్ దాఖలు చేశారు. ఆయనకు మద్దతుగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు నామినేషన్ కేంద్రానికి చేరుకుని సంఘీభావం తెలిపారు. సర్పంచ్ అభ్యర్థితో పాటు గ్రామంలోని వివిధ వార్డులకు సంబంధించిన అభ్యర్థులు సైతం నామినేషన్లు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా తెలుగుదేశం పార్టీ జనరల్ సెక్రటరీ లోలుగు వెంకట్ కామరాజుకు మద్దతు ప్రకటించగా, కూటమి పార్టీల నాయకులు ఆయనకు అండగా నిలిచారు.

కేశవదాసుపురంలో లింగాల రాజు నామినేషన్

మండలం కేశవదాసుపురం గ్రామంలో టీడీపీ జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు గాడు నారాయణరావు బలపరిచిన అభ్యర్థి లింగాల రాజు సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు లోలుగు జెడ్పీ హై స్కూల్ లో తన నామినేషన్ పత్రాన్ని సమర్పించారు. ఆమెకు మద్దతుగా వార్డు సభ్యుల అభ్యర్థులు గాడు అనురాధ (మాజీ సర్పంచ్), గాడు వాగ్దేవి, లింగాల జ్యోతి, బి. ధనలక్ష్మి, ఎన్. శ్రావణి, అలాబోయిన కృష్ణవేణి, లింగాల రామప్పుడు, విజయలక్ష్మి తదితరులు నామినేషన్లు సమర్పించారు.

లోలుగు నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి

లోలుగు గ్రామంలోని నామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి సందర్శించారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నామినేషన్ కేంద్రం వద్ద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ సిబ్బందికి ఆదేశించారు.

పొందూరు పంచాయతీలో సర్పంచ్‌కు నిల్.. రెండు వార్డులకు నామినేషన్లు

పొందూరు గ్రామ పంచాయతీలో మొదటి రోజు సర్పంచ్ పదవికి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. అయితే వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి 10వ, 14వ వార్డుల అభ్యర్థులు మాత్రమే తమ నామినేషన్లు సమర్పించారు.

కత్తిపూడిలో వైసీపీకి మరో షాక్.. టీడీపీలోకి తూపాటి దుర్గ, తూపాటి బద్రి..

--ఎమ్మెల్యే సత్యప్రభ సూచనలతో పార్టీ బలోపేతానికి వరుసగా చేరికలు

-- వెన్నా శివ, కంచిబోయిన శ్రీను, గాబు కృష్ణమూర్తి, కేళంగి జనార్ధన్ సమక్షంలో చేరికలు



కాకినాడ జిల్లా నవంబర్ 18 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్) కత్తిపూడిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరుతుండగా, తాజాగా కత్తిపూడికి చెందిన వైసీపీ నాయకులు వైఎస్సార్ తూపాటి దుర్గ, తూపాటి బద్రి పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచనల మేరకు రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, జడ్పీటీసీ సభ్యుడు కంచిబోయిన శ్రీను, సొసైటీ చైర్మన్ గాబు కృష్ణమూర్తి , టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ కేళంగి జనార్ధన్ ఆధ్వర్యంలో వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవీఆర్, నేమాల నూకరాజు, అమజాల రామకృష్ణ, యదాల పూసలు, మనుముల బాబ్జి, అమజాల సూర్యచక్రం, కొయ్యా నాగేశ్వరరావు, మనుముల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల ప్రాముఖ్యతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



చింతకొమ్మదిన్నె, నవంబరు 18: పుస్తక పఠనంపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించి, విజ్ఞానాన్ని వికసింపజేసే లక్ష్యంతో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి ఆధ్వర్యంలో 8, 9వ తరగతి విద్యార్థులకు గ్రంథాలయాలు -- వాటి ఉపయోగాలు అనే అంశంపై పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాల ప్రాముఖ్యత, పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలపై విద్యార్థులు వ్యాసాలు రాశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఇబ్రహీం, ఉపాధ్యాయులు గంగాధర్, గురవయ్య, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సోమలగూడూరు సర్పంచ్ బరిలో వెంకట్రామిరెడ్డి సతీమణి పద్మావతి



నందవరం, నవంబర్ 18 (ప్రజా జ్యోతి): మండల పరిధిలోని టీ. సోమలగూడూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్, టీడీపీ సీనియర్ నాయకుడు వెంకట్రామిరెడ్డి సతీమణి గుండ్రేవుల పద్మావతి పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్తుల కోరిక మేరకు పద్మావతిని సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిపినట్లు తెలిపారు. వెంకట్రామిరెడ్డి గతంలో ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి సహకారంతో గ్రామానికి నిధులు తీసుకొచ్చి సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడంతో పాటు తాగునీరు, సాగునీటి సౌకర్యాల కల్పనకు కృషి చేశారని పేర్కొన్నారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన ఆయ న సేవలను గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బింగమ్మ గారి రంగనాయకులు



(ప్రజా జ్యోతి న్యూస్) ప్యాపిలి: నవంబర్ 18 ప్యాపిలి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బింగమ్మ గారి రంగనాయకులును వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయించడం జరిగింది.పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయంతో ప్యాపిలిలో వైసీపీ శ్రేణుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. రంగనాయకులు విజయం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రచారానికి సిద్ధమవుతున్నారు. ప్యాపిలి గ్రామంలో సర్పంచి ఎన్నిక హోరాహోరీగా సాగనుంది.

ఎంపీటీసీగా రాజకీయ ప్రస్థానం.. ఇప్పుడు సర్పంచ్ బరిలోకి తిప్పారెడ్డి

మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి తనయుడిగా రాజకీయ నేపథ్యం..

మాంద్ర శివానందరెడ్డి, గౌరు వెంకట్‌రెడ్డికి ముఖ్య అనుచరుడిగా గుర్తింపు

ప్రజా జ్యోతి నందికొట్కూరు గ్రామీణ రాజకీయాల్లో కుటుంబ నేపథ్యంతో పాటు వ్యక్తిగత రాజకీయ అనుభవం కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ఈ నేపథ్యంలో దామగట్ల గ్రామ రాజకీయాల్లో తిప్పారెడ్డి పేరు మరోసారి చర్చకు వస్తోంది. మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి కుమారుడైన తిప్పారెడ్డి చిన్ననాటి నుంచే గ్రామీణ రాజకీయ వాతావరణాన్ని దగ్గరగా చూస్తూ వచ్చారు. తండ్రి రాజకీయ ప్రస్థానం, గ్రామస్థాయిలో ఆయనకు ఉన్న పరిచయాలు తిప్పారెడ్డికి రాజకీయాలపై ఆసక్తిని పెంచాయి. రాజకీయాల్లో అడుగుపెట్టిన ఆయన ప్రజాప్రతినిధిగా తన అదృష్టాన్ని పరీక్షించుకుని ఒకసారి ఎంపీటీసీగా విజయం సాధించారు. ఎంపీటీసీగా ఎన్నిక కావడంతో గ్రామస్థాయి రాజకీయాల్లో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రజాప్రతినిధిగా పనిచేసిన అనుభవం ఆయన రాజకీయ ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.ఇక రాజకీయంగా మాంద్ర శివానందరెడ్డి, గౌరు వెంకట్‌రెడ్డికి ముఖ్య అనుచరుడిగా కొనసాగుతున్న తిప్పారెడ్డి మాంద్ర, స్థానిక రాజకీయ పరిణామాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ తన రాజకీయ సంబంధాలను కొనసాగిస్తున్నారు.



సర్పంచ్ ఎన్నికల బరిలోకి దిగేందుకు సన్నాహాలు

గతంలో ఎంపీటీసీగా ప్రజాప్రతినిధిగా పనిచేసిన ఆయన, ఇప్పుడు మరోసారి గ్రామ రాజకీయాల్లో ప్రత్యక్ష పాత్ర పోషించేందుకు సిద్ధమవుతున్నారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో దామగట్ల గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.ఎంపీటీసీగా గతంలో పనిచేసిన అనుభవాన్ని, తన కుటుంబ రాజకీయ నేపథ్యాన్ని, గ్రామస్థాయిలో ఉన్న పరిచయాలను ఆధారంగా చేసుకుని సర్పంచ్ ఎన్నికల్లో తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసా గించాలనే ఆలోచనలో ఉన్నారు. ఒకప్పుడు ఎంపీటీసీగా ఎన్నికైన తిప్పారెడ్డి ఇప్పుడు సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దిగేం దుకు సిద్ధమవుతుండటంతో దామగట్ల గ్రామ రాజకీయాల్లో ఆయన పేరు ప్రస్తావనకు వస్తోంది. రాబోయే ఎన్నికల్లో ఆయన అభ్యర్థిత్వం, ప్రచార తీరు, గ్రామ సమస్యల పై ఆయన ప్రస్తా వించే అంశాలు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

క్.. టీడీపీలోకి 20 కుటుంబాలు చేరిక



ఎమ్మిగనూరు, నవంబర్ 18 (ప్రజా జ్యోతి): గార్లదిన్నె గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. గ్రామానికి చెందిన 20 కుటుంబాలు వైసీపీని వీడి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సుందరాజు, ఎస్. పేతురు, ఎస్. మాదన్న తదితరులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ప్రజాపాలనకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు, గౌరవం కల్పిస్తామని, పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గార్లదిన్నెలో టీడీపీలోకి వలసలు పెరుగుతుండటంతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇరవయ్యో వార్డులో ఆంజనేష్ నాయుడు ప్రచార హోరు

అభివృద్ధే అజెండాగా కూటమి నేతల ఇంటింటి ప్రచారం

జనసేన అభ్యర్థి కారుమూరి ఆంజనేష్ నాయుడుతో కలిసి ప్రచారంలో పాల్గొన్న కూటమి నాయకులు

బాపట్ల నవంబర్ 18 (ప్రజాజ్యోతి జిల్లా ప్రతినిధి) బాపట్ల మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఇరవయ్యో వార్డు సందడిగా మారింది. కూటమి బలపరిచిన జనసేన కౌన్సిలర్ అభ్యర్థి కారుమూరి ఆంజనేష్ నాయుడు స్వయంగా ప్రచారంలో పాల్గొంటూ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. తనకు మద్దతు ఇవ్వాలని కోరుతూ స్థానికులతో మమేకమయ్యారు. ఆయనకు మద్దతుగా కూటమి నాయకులు, మాజీ కౌన్సిలర్లు కూడా ప్రచారంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వార్డులో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక వసతులపై స్థానికులు వ్యక్తం చేస్తున్న అవసరాలను పరిశీలించారు. వార్డు అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆంజనేయ నాయుడు తెలిపారు.ఈ ప్రచార కార్యక్రమంలో బీజేపీ బాబ్జి నంద, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్కే రాయల్, టీడీపీ టౌన్ సెక్రటరీ శీలం శ్రీనివాస్ కుమార్, మాజీ కౌన్సిలర్లు సుగుణవతి, శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పని కూలీలకు తప్పకుండా పని కల్పించాలి - ఎంపీడీఓ



దువ్వూరు,నవంబరు18 (ప్రజా జ్యోతి) క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు ఇంజనీరింగ్ కన్సల్టెంట్ మరియు ఏపీవో లతో వివిజిరామ్ జి సిబ్బందితో ఎంపీడీఓ జవహర్ బాబు బుధవారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అందరూ కలిసి మండలంనకు ఇచ్చిన లక్ష్యం మేరకు శ్రామికులకు తప్పకుండా పని కల్పించాలని, సరాసరి వేతనం 312 రూపాయలు వచ్చే విధంగా పనిచేయించాలని, 2027-28 ఆర్థిక సంవత్సరం నకు పనుల గుర్తింపు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి!

పోలవరం జిల్లాలో రెండు విడతలుగా పంచాయతీ ఎన్నికలు

12 మండలాల్లో 1,734 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

ఓటర్లు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేయాలి

ఓటర్లకు కలెక్టర్ కె. దినేష్ కుమార్ పిలుపు



రంపచోడవరం/ఎటపాక, నవంబర్ 18 (ప్రజాజ్యోతి):గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించు కోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. పోలవరం జిల్లాలోని 12 మండలాల్లో రెండు విడతలుగా సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

నవంబర్ 26న ఐదు మండలాల్లో తొలి విడత పోలింగ్

మొదటి విడతలో రాజవొమ్మంగి, అడ్డతీగల, గంగవరం, దేవీపట్నం, రంపచోడవరం మండలాల్లో నవంబర్ 26న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుంది. అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు. తొలి విడతలో సర్పంచ్ పదవులకు 506, వార్డు సభ్యుల పదవులకు 2,010 నామినేషన్లు దాఖలైనట్లు కలెక్టర్ తెలిపారు.

నవంబర్ 29న ఏడు మండలాల్లో రెండో విడత

రెండో విడతలో మారేడుమిల్లి, వై.రామవరం, గుర్తేడు, చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల్లో నవంబర్ 29న పోలింగ్ నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్ జరుగుతుంది.ఈ విడతకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుండగా, నవంబర్ 20 చివరి తేదీగా నిర్ణయించారు నవంబర్ 21న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు.

1,734 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,734 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు, ఎన్నికల సిబ్బంది, భద్రతా ఏర్పాట్లు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

24 గంటల పాటు కంట్రోల్ రూమ్ సేవలు

ఎన్నికలకు సంబంధించి ప్రజలు, ఓటర్లు, అభ్యర్థుల సమస్యలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు జిల్లా స్థాయిలో 24 గంటల పాటు కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని కలెక్టర్ తెలిపారు. మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వహిస్తూ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్ 18004254225కు ఫోన్ చేసి ఎన్నికలకు సంబంధించిన సమాచారం, ఫిర్యాదులు తెలియజేయవచ్చని సూచించారు.

ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలి

గ్రామాల అభివృద్ధికి, స్థానిక పరిపాలనకు గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎంతో కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పోలింగ్ రోజున కేంద్రానికి చేరుకుని ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లొంగకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా తమకు నచ్చిన అభ్యర్థిని ఎన్నుకోవాలని కోరారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ పాటిస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు, ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి కె. దినేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

శాలివాహన సంఘానికి రూ.లక్ష ఆర్థిక సహాయం

మాజీ ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ ఔదార్యం.. సంఘ అభివృద్ధికి అండ



శంఖవరం, నవంబర్ 18 (ప్రజా జ్యోతి):మండల కేంద్రమైన శంఖవరం గ్రామానికి చెందిన వెనుకబడిన తరగతుల కుమ్మరి శాలివాహన సంఘానికి ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. సంఘ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి తన వంతు సహకారంగా ఈ ఆర్థిక సహాయాన్ని అందించడం పట్ల సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ మాట్లాడుతూ.. సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని అన్నారు. ముఖ్యంగా కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వెనుకబడిన తరగతుల ప్రజల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి చేయూతనివ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. శాలివాహన సంఘం సభ్యులంతా ఐకమత్యంతో ఉంటూ సంఘ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సంఘానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. సంఘానికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందించిన మాజీ ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌కు శాలివాహన సంఘం ప్రతినిధులు, సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన అందించిన ఆర్థిక సహాయం సంఘ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో శాలివాహన సంఘం సభ్యులు, పెద్దలు, అభిమానులు పాల్గొన్నారు.

కంబదూరు సర్పంచ్ అభ్యర్థి కిరణ్ కుమార్ విజయానికి సమష్టిగా కృషి చేయండి

వైసీపీ నాయకులు, కార్యకర్తలకు మాజీ ఎంపీ తలారి రంగయ్య పిలుపు



కంబదూరు నవంబర్ 18 (ప్రజాజ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్, కంబదూరు మేజర్ గ్రామపంచాయతీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి భోగం కిరణ్ కుమార్ విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని మాజీ ఎంపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త తలారి రంగయ్య పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి కిరణ్ కుమార్ గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులతో కలిసి కళ్యాణదుర్గంలోని పార్టీ కార్యాలయంలో తలారి రంగయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో కంబదూరు గ్రామంలో నెలకొన్న స్థానిక రాజకీయ పరిస్థితులు, సర్పంచ్ ఎన్నికలు, గ్రామంలో పార్టీ శ్రేణుల కార్యాచరణ తదితర అంశాలపై చర్చించారు.అనంతరం తలారి రంగయ్య మాట్లాడుతూ.. పార్టీ బలపరిచిన అభ్యర్థి కిరణ్ కుమార్ విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా తీసుకొని క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. గ్రామ అభివృద్ధిని కాంక్షిస్తూ కిరణ్ కుమార్‌కు ప్రజల మద్దతు కూడగట్టేందుకు పార్టీ శ్రేణులంతా ఐక్యంగా కృషి చేయాలని కోరారు. కంబదూరు మేజర్ పంచాయతీలో కిరణ్ కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

పంచాయతీ స్థానిక ఎన్నికల్లో టీ.ఎల్ రాజు నామినేషన్ దాఖల్....!!



విజయవాడ రూరల్:(నవంబర్ 18,ప్రజా జ్యోతి బ్యూరో:వైయస్ఆర్ గ్రామపంచాయతీ విజయవాడ రూరల్ మండలం మైలవరం నియోజకవర్గం ఎన్టీఆర్ జిల్లా మాజీమంత్రివర్యులు శ్రీ జోగి రమేష్ గారు బలపరిచిన అభ్యర్థిగా టి.ఎల్ రాజు. వైయస్సార్ గ్రామపంచాయతీ త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలకు సంబంధించి విజయవాడ రూరల్ మండలం వైయస్సార్ గ్రామపంచాయతీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 6 నెంబర్ వార్డు అభ్యర్థిగా టి.ఎల్ రాజు పోటీ చేయుచున్నారు. కావున ఆకాండ మెజారిటీ తో గెలిపించాలి అని కోరుతున్నాము. వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయ సాధన కోసం టి.ఎల్ రాజు గారి గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది సంక్షేమ పాలన కావాలంటే వైసిపి నే గెలిపించాలి పత్రికా ప్రకటన ద్వారా గా టి.ఎల్ రాజు గారు సతీమణి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి చాందిని పఠాన్ నామినేషన్ లో పాల్గొన్నారు..

వేగేశ్వరపురంలో తైలం సత్యాదేవికి మద్దతుగా టీవీ రామారావు ప్రచారం





తాళ్లపూడి, నవంబర్ 18, ప్రజాజ్యోతి న్యూస్ తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తైలం పోశారావు కుమార్తె, విద్యావంతురాలు తైలం సత్యాదేవికి మద్దతుగా కొవ్వూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీవీఆర్ గ్రామంలో అడుగుపెట్టగానే గ్రామమంతా జనసంద్రమైంది, జనసైనికులు, గ్రామస్తులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని సత్యాదేవికి బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా టీవీ రామారావు మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ సేవ చేస్తూ వస్తున్న తైలం పోశారావు కరోనా సమయంలో కూడా గ్రామంలో ఉన్న ప్రతి ఇంటికి బియ్యం, నిత్యావసరాలు అందించారని అలాగే కష్టంలో ఉన్నవారికి చేయూతనిస్తూ అండగా నిలుస్తున్నారని అలాంటి సేవా కుటుంబం నుంచి వచ్చిన విద్యావంతురాలు తైలం సత్యాదేవిని సర్పంచ్ గా గెలిపిస్తే గ్రామం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని స్వచ్ఛమైన పాలన అందుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ సత్యాదేవిని ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని టీవీఆర్ గ్రామ ప్రజలను కోరారు


గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా కార్యదర్శి



శంఖవరం, నవంబర్ 18(ప్రజాజ్యోతి న్యూస్) శంఖవరం శాఖా గ్రంథాలయాన్ని బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్రీమతి కె.జె.ఎస్.ఎల్ కుమారి అకస్మిక తనిఖీ చేశారు. శంఖవరం గ్రంథాలయ అధికారిని చెవల ప్రియాంక నుంచి రికార్డులను తీసుకుని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, ముఖ్యంగా విద్యార్థులు గ్రంథాలయాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ద్వారా గొప్ప విజ్ఞానాన్ని సమకూర్చుకోవచ్చునని అన్నారు.

కనకవీడు సర్పంచ్ అభ్యర్థిగా కె. రఘుమూర్తి స్వామి

ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి ఆశీస్సులతో బరిలోకి.



నందవరం, నవంబర్ 18 (ప్రజా జ్యోతి): మండల పరిధిలోని కనకవీడు గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కె. రఘుమూర్తి స్వామి పోటీ చేయనున్నారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి ఆశీస్సులు, సూచనలతో సర్పంచ్ ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రఘుమూర్తి స్వామి మాట్లాడుతూ ఎమ్మెల్యే తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, సర్పంచ్‌గా తనను భారీ మెజారిటీతో గెలిపించి ఎమ్మెల్యేకు కానుకగా ఇస్తానని పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే సహకారంతోనే గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని పేర్కొంటూ, గ్రామ ప్రజలు తనకు మద్దతు తెలిపి సర్పంచ్‌గా గెలిపించాలని కోరారు.

కుమారుడి పుట్టినరోజున సేవా స్ఫూర్తి.. విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ!




నేరడిగొండ : 'చేయూత ఫౌండేషన్' చైర్మన్ ఎన్.టి. రమణ తన కుమారుడు జాన్ పాల్ జన్మదినాన్ని పురస్కరించుకుని కుమారి గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారు.ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని, విద్యార్థులంతా క్రమశిక్షణ తో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించా రు. జన్మదిన వేడుకలను కేవలం వ్యక్తిగత సంబరాలకే పరిమితం చేయకుండా, పేద విద్యార్థులకు ఉపయోగపడేలా సేవా కార్యక్రమం నిర్వహించడం ఎంతో అభినందనీయమని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగారాం, శివలీల తదితరులు జాన్ పాల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులో ఉన్నత ఆశయాలతో మరింత అభివృద్ధి సాధించాలని దీవించారు.

రాజ్యాంగ విలువల పరిరక్షణకు, ఉద్యోగుల ఐక్యతకు పెద్దపీట

శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

మంచిర్యాల : సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ అధికారులు, ఉద్యోగుల సమావేశం బుధవారం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని సభ్యులందరి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి శ్రీరాంపూర్ ఏరియా డిప్యూటీ జనరల్ మేనేజర్ (పర్సనల్) డాక్టర్ ఎస్. అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఐఈ) పి. రాజన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నికతో పాటు 76వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకల నిర్వహణ, భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సదర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా డాక్టర్ ఎస్. అనిల్ కుమార్ (డీజీఎం–పర్సనల్), అడ్వైజర్‌గా పి. రాజన్న (డీజీఎం–ఐఈ) ఎంపికయ్యారు. కో–కన్వీనర్లుగా కే. రవి (ఏఓ), జే. సంగీత (ఈఈ), దారావత్ రాజేష్, సంజయ్ యాదవ్, జై కుమార్, అజ్మీర గణేష్, ఎస్. శ్రావణ్ కుమార్ లు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా జి. నవీన్, సీహెచ్. మౌనిక, సీహెచ్. రజిత, కే. సుమన్, కే. కీర్తి, స్వామి, బానోత్ గీత, జుమ్మిడి శ్యామల, కే. తనుజ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వక్తలు



మాట్లాడుతూ, అధికారుల, ఉద్యోగుల మధ్య ఐక్యత, సమన్వయం, పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని సూచించారు భారత రాజ్యాంగం అందించిన సమానత్వం, సామాజిక న్యాయం, సోదరభావం వంటి విలువలను పరిరక్షిస్తూ ముందుకు సాగాలని పేర్కొన్నారు. నూతన కమిటీ సమిష్టి కృషితో అధికారుల, ఉద్యోగుల సంక్షేమానికి, సంఘటిత శక్తిని బలోపేతం చేయడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ లైజన్ ఆఫీసర్ ఆర్. గుండెరావుతో పాటు పలువురు అధికారులు, ఉద్యోగులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బొగ్గు నాణ్యతలో శ్రీరాంపూర్ ఏరియాకు ద్వితీయ బహుమతి

78.85 శాతం గ్రేడ్ సంతృప్తితో సింగరేణిలో రెండో స్థానం..

సమిష్టి కృషితో మళ్లీ ప్రథమ స్థానానికి చేరుకుంటాం

శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్

మంచిర్యాల : సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ పరిధిలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బొగ్గు నాణ్యతలో శ్రీరాంపూర్ ఏరియా ద్వితీయ బహుమతిని సాధించింది. 78.85 శాతం గ్రేడ్ సంతృప్తి సాధించి సింగరేణిలోని అన్ని ఏరియాల్లో రెండో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా బుధవారం గోదావరిఖనిలోని ఇల్లందు క్లబ్‌లో నిర్వహించిన కోల్ క్వాలిటీ అవేర్‌నెస్ వీక్ ముగింపు కార్యక్రమంలో డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కె. వెంకటేశ్వర్లు చేతుల మీదుగా శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్, ఏరియా అధికారులతో కలిసి ద్వితీయ బహుమతిని స్వీకరించారు. నవంబర్ 12 నుంచి 18 వరకు సింగరేణి వ్యాప్తంగా నిర్వహించిన బొగ్గు నాణ్యత వారోత్సవాల్లో భాగంగా అన్ని ఏరియాల గనులు, కార్యాలయాలు, వివిధ విభాగాల్లో బొగ్గు నాణ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బొగ్గు నాణ్యత ప్రాధాన్యత, వినియోగదారుల ఆదరణ పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బొగ్గు నాణ్యత పురస్కారాలను అందజేశారు. యాజమాన్యం సూచనల మేరకు శ్రీరాంపూర్ ఏరియాలో బొగ్గు నాణ్యతకు అధిక ప్రాధాన్యత



ఇస్తున్నామని జీఎం మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ప్రథమ బహుమతి సాధించగా, 2025–26లో ద్వితీయ బహుమతి పొందడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో అధికారులు, కార్మికుల సమిష్టి కృషితో శ్రీరాంపూర్ ఏరియాను తిరిగి ప్రథమ స్థానంలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ.వి.రెడ్డి, ఎస్ఆర్పీ ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సీహెచ్. వెంకటేశ్వర్లు, సీహెచ్పీ ఇన్‌చార్జి చంద్రలింగం, శ్రీరాంపూర్ ఏరియా క్వాలిటీ ఇన్‌చార్జి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కోదాడ అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం

అయ్యప్ప స్వామి నామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం.

కోదాడ: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీక మాసం, అయ్యప్ప మాలధారణ సందర్భంగా భక్తిభావంతో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని కోరిన కోరికలు తీర్చమని వేడుకుంటారు. ప్రతిరోజు స్వామివారికి ప్రత్యేక అభిషేకములు, అలంకరణ నిర్వహిస్తారు. కోదాడ అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రతి బుధవారం స్వామివారికి పల్లకి సేవ నిర్వహించడం జరుగుతుంది, అయ్యప్ప నామస్మరణలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తిమయ వాతావరణాన్ని సంతరించుకుంది. అయ్యప్ప స్వాములు, మాలధారులు, మహిళలు, చిన్నారులు, వృద్ధులు సహా ఆలయానికి విచ్చేసిన భక్తులం దరికీ ప్రేమాభిమానాలతో అన్నప్రసాదాన్ని అందజేశారు. భక్తులు క్రమశిక్షణతో అన్నప్రసాదాన్ని స్వీకరించి నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్తీక మాసంలో అయ్యప్ప మాలధారణకు ఎంతో విశిష్టత ఉందని, ఈ పవిత్ర సమయంలో భక్తితో స్వామివారిని ఆరాధించడంతో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో పుణ్యప్రదమని భక్తులు పేర్కొన్నారు. అన్నదానం అన్ని దానాల్లోకెల్లా గొప్పదని, కార్తీక మాసంలో చేసే ప్రతి దానం రెట్టింపు ఫలితం అందిస్తుందని అంటారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం ద్వారా మానవత్వం, సేవాభావం చాటుకోవచ్చని అన్నారు. ఆధ్యాత్మికతతో పాటు సేవా భావాన్ని పెంపొందించే ఇలాంటి అన్నదాన కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సోదరభావం, భక్తిభావాన్ని మరింత పెంపొందిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు. ఈరోజు స్వామివారికి నైవేద్యం సమర్పించిన వారు వేజెండ్ల శివనాగు భవాని దంపతులు. ఈరోజు అన్నదాతలు నారాయణపురం వాస్తవ్యులు బూర వెంకటనారాయణ, లక్ష్మీనారాయణ, నరసింహారావు కుటుంబ సభ్యులు.
ఈ అన్నదాన కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు, మాలధారులు, భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మొదటి రోజు 7 సర్పంచ్, 8 వార్డు సభ్యుల నామినేషన్లు



నందవరం, నవంబర్ 18 (ప్రజా జ్యోతి): పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా బుధవారం నందవరం మండలంలో మొదటి రోజు మొత్తం 15 నామినేషన్లు దాఖలయ్యాయి. గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవులకు ఏడుగురు అభ్యర్థులు, వార్డు సభ్యుల స్థానాలకు ఎనిమిది మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ విషయాన్ని అసిస్టెంట్ జిల్లా ఎన్నికల అధికారి, ఎంపీడీవో పుల్లయ్య, తహశీల్దార్ అబ్దుల్ వహాబ్ తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా ఎన్నికల కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

చొప్పెల్ల గ్రామ కూటమి సర్పంచ్ అభ్యర్థిగా సకుమళ్ల ఏసమ్మ నామినేషన్.



ఆలమూరు, నవంబర్ 18 (ప్రజాజ్యోతి):ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల బరిలో కూటమి అభ్యర్థిగా సకుమళ్ల ఆది పట్టాభిరామన్న (రాముడు) సతీమణి సకుమళ్ల ఏసమ్మ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. గ్రామంలో కూటమి తరపున సర్పంచ్ అభ్యర్థిగా ఆమెను ఎంపిక చేయడంతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నాయి.రాముడు గతంలో చొప్పెల్ల గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా, ఇటుక బట్టీల సంఘం అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పనిచేశారు. గ్రామంలో అందరితో సత్సంబంధాలు కలిగి, వివాదాలకు దూరంగా ఉండే వ్యక్తిగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో ఆయన సతీమణి ఏసమ్మను కూటమి సర్పంచ్ అభ్యర్థిగా ఎంపిక చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.గ్రామ నాయకులు, కార్యకర్తలు ఏసమ్మ అభ్యర్థిత్వం పట్ల ఏకతాటిపైకి వచ్చి విజయానికి కృషి చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కూటమి పార్టీల మధ్య సమన్వయం, గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తల ఐక్యత ఈ ఎన్నికల్లో కీలకంగా మారనున్నాయి.చొప్పెల్ల గ్రామంలో మూడు ఎంపీటీసీ స్థానాలు ఉండగా, ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో మూడు స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. అదే ఐక్యతను గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కొనసాగించి సర్పంచ్,వార్డు మెంబర్ల స్థానాలని కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో కూటమి నాయకులు ముందుకు సాగుతున్నారు.

పేరుకే మేజర్ పంచాయతీ

ఆ వీధిలో నీటి కష్టాలు...ప్రజలకు తప్పని తిప్పలు




దువ్వూరు,నవంబరు18 (ప్రజా జ్యోతి) దువ్వూరు మండల కేంద్రంలోని కొత్త కొట్టాలు వీధి ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు.దాదాపు మూడు రోజులకుఒక సారి నీళ్లు వస్తున్నడంతో చాలా ఇబ్బందిగా మారింది.వాటర్ మ్యాన్ విషయానికి వస్తే మటన్ షాప్, చికెన్ షాప్ వాళ్ళ కావాల్సినప్పుడల్లా నీళ్లు వదలడం ఆయనకు అలవాటుకు మారింది. ఇక సామాన్య ప్రజలు అడిగితె నిమ్మకు నీరెత్తినట్లు ఆయన వ్యవహరించడం. సమయపాలన లేకుండా ఎప్పుడంటే అప్పుడు నీరు వదలడంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు.పంచాయతీ అధికారులు స్పందించి నీరు వదులుటకు, సమయపాలన ఏర్పాట్లు చేయాలనీ ప్రజలు కోరుతున్నారు.

హటహాసంగా వార్డు మెంబర్ నామినేషన్

బద్వేల్ రూరల్ నవంబర్ 18 ప్రజా జ్యోతి న్యూస్.... బద్వేల్ మండలం పుట్టాయిపల్లె పంచాయతీ గొడుగునూరు గ్రామం 10వ వార్డు మెంబర్ గా తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థిగా పాణ్యం లక్ష్మీనారాయణ నామినేషన్ దాఖలు చేశారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గోడి రవికుమార్ రెడ్డి కడప జిల్లా పార్లమెంటరీ ఆర్గనైజర్ సెక్రెటరీ బైసాని ప్రతాప్ రెడ్డి. బలరాం రెడ్డి పాల్గొన్నారు





అయ్యప్ప భక్తి నేపథ్యంలో వైభవ్ 'హరిహర పుత్ర'.. ఆకట్టుకుంటున్న టీజర్!

టాలెంటెడ్ హీరో వైభవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'హరిహర పుత్ర' బ్లాక్‌బస్టర్ సినిమా 'మాళిగాపురం' ఫేమ్ విష్ణు శశి శంకర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. స్వామి అయ్యప్ప భక్తి, ఆధ్యాత్మికత మరియు ఉత్కంఠభరితమైన రహస్యాల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా తెలుగు టీజర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ చిత్రంలో వైభవ్ పూర్తి భక్తిభావంతో కూడిన అయ్యప్ప భక్తుడిగా నటిస్తుండగా, ఆయన సరసన మీనాక్షి గోవిందరాజన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. వీరితో పాటు ఆడుకాలం నరేన్, అరవింద్ ఆకాష్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రంలో రవి మోహన్, మిర్చి శివ, వెంకట్ ప్రభు, కృష్ణ, మహత్, ప్రేమ్‌జీ అమరన్ మరియు గంగై అమరన్ వంటి ప్రముఖులు ప్రత్యేక పాత్రల్లో నటిస్తున్నారు. తంత్రా ఫిలింస్ పతాకంపై జె.కె. శరవణ, ఎం. రాజారామ్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ప్రముఖ దర్శకుడు వెంకట్ ప్రభు దీనికి క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాకు ప్రేమ్‌జీ అమరన్ సంగీతం అందిస్తుండగా, ప్రవీణ్ కె.ఎల్. ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



బ్లాక్ డ్రెస్‌లో మౌనీ రాయ్ గ్లామర్ షో.. చూపు తిప్పుకోలేరు!

వయ్యారాలు ఒలకబోస్తున్న రకుల్.. క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కట్టిపడేస్తున్న బ్యూటీ



విమర్శలను మోటివేషన్‌గా మార్చుకుంటున్నా దుల్కర్ సల్మాన్!

ప్రముఖ నటుడు దుల్కర్ సల్మాన్ ఆన్‌లైన్ నెగెటివిటీ, విమర్శలను ఎదుర్కొనే విధానంపై మరియు అవి తన కెరీర్ ఎంపికలపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయనే దానిపై తాజాగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో తనను తీవ్రంగా కుంగదీసిన విమర్శలు ఇప్పుడు తనకు సులభంగా ఎదుర్కొనేలా మారాయని తెలిపారు. తన ఉద్దేశం ఎప్పుడూ మంచి సినిమాలు చేయడమేనని, ఎంత కష్టపడినా కొద్దిపాటి నెగెటివిటీ రావడం సహజమని ఆయన గ్రహించారు. అయితే, ఆ నెగెటివిటీని తానెప్పుడూ కక్షగా లేదా అసూయగా మార్చుకోలేదని, దాన్ని ఒక మోటివేషన్‌గా తీసుకుని తనని తాను నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తానని దుల్కర్ వెల్లడించారు. "కొంతమంది నేను ఒక పాత్ర చేయలేనని భావిస్తే, నేను దాన్ని సవాల్‌గా తీసుకుని చేయడానికి ప్రయత్నిస్తాను. భయపెట్టే లేదా సవాల్‌తో కూడిన పాత్రలను ఎంచుకోవడం వల్ల నటుడిగా నా ఎదుగుదల సాధ్యమైంది. ప్రస్తుతం నాలో ఎలాంటి కసి లేదా పగ లేదు" అని ఆయన భావోద్వేగంగా చెప్పుకొచ్చారు. మరోవైపు, పవన్ సాధినేని దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ నటిస్తున్న తెలుగు డ్రామా చిత్రం 'ఆకాశంలో ఒక తార' నవంబర్ 20, 2026న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదే రోజున ఆయన తండ్రి, మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి నటించిన 'ఓ.ఎం: ఆపరేషన్ మోల్' కూడా విడుదలవుతుండటంతో, బాక్సాఫీస్ వద్ద తండ్రీకొడుకుల సినిమాల మధ్య ఆసక్తికరమైన పోటీ నెలకొంది.



తిరువీర్ కెరీర్‌లో ఆల్ టైమ్ బ్లాక్‌బస్టర్.. 'మసూద' సినిమాకు 4 ఏళ్లు!

టాలీవుడ్ వర్ధమాన నటుడు తిరువీర్ కెరీర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంచలనాత్మక హారర్ థ్రిల్లర్ 'మసూద' సాయికిరణ్ దర్శకత్వంలో రాహుల్ యాదవ్ నక్కా స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రం, ఎలాంటి భారీ అంచనాలు లేకుండా చిన్న సినిమాగా 2022 నవంబర్ 18న విడుదలై బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. అప్పట్లో ప్రేక్షకులను భయపెడుతూనే బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించిన ఈ సినిమా, తాజాగా విడుదలై నాలుగేళ్లు పూర్తి చేసుకుంది. ఈ చిత్రంలో కేవలం భయపెట్టే హారర్ సన్నివేశాలు మాత్రమే కాకుండా, ప్రేక్షకులను కట్టిపడేసే బలమైన భావోద్వేగాలు ఉండటంతో అన్ని వర్గాల ప్రేక్షకులు దీనికి కనెక్ట్ అయ్యారు. ఒక సాధారణ అమ్మాయి మసూద ఆత్మ ఆవహించడం, ఆమెను కాపాడుకునేందుకు తల్లి నీలం (సంగీత), పక్కనే ఉండే గోపి (తిరువీర్) చేసే ప్రయత్నాలు సినిమాను ఆద్యంతం ఉత్కంఠగా నడిపించాయి. తిరువీర్ సహజ నటనతో పాటు, కీలక పాత్రలో నటించిన నటి సంగీత అద్భుతమైన పెర్ఫార్మెన్స్ సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. అలాగే కావ్యా కల్యాణ్‌రామ్, శుభలేఖ సుధాకర్ తదితరుల నటన కూడా చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కినప్పటికీ, పకడ్బంది స్క్రీన్ ప్లే మరియు నేపథ్య సంగీతంతో ప్రేక్షకులకు సరికొత్త హారర్ అనుభూతిని పంచింది 'మసూద'. ఈ సినిమా ఘన విజయం తిరువీర్ కెరీర్‌ను మలుపు తిప్పడమే కాకుండా, టాలీవుడ్‌లో కొత్త తరహా హారర్-థ్రిల్లర్ జోనర్‌కు సరికొత్త ఊపునిచ్చింది. విడుదలై ఇన్ని ఏళ్లు గడుస్తున్నప్పటికీ, ఈ సినిమా అందించిన భయంతో కూడిన థ్రిల్ మాత్రం ప్రేక్షకుల మదిలో అలాగే నిలిచిపోయింది. మరోవైపు ఈ సినిమా సీక్వెల్ ఎప్పుడా అని ప్రేక్షకుల ఎదురుచూస్తున్నారు.



Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,